# మనం

/manamnews
www.manamnews.com

జనం కోసం అక్షర యజ్ఞం..

కరీంనగర్
శుక్రవారం
27-10-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 268
పేజీలు : 8

KARIMNAGAR | HYDERABAD | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

అశ్వయుజ మాసం, శుక్రవారం, తిథి : త్రయోదశి ఉ.06.57 వరకు, నక్షత్రం: ఉత్తరాభాద్ర, ఉ:09.24 వరకు, వర్జ్యం: సా.08.28-09.56 వరకు, దుర్ముహూర్తం: ఉ.08.33-09.19 వరకు, రాహుకాలం: మ.10.34-11.59 వరకు


## శిర్డీ సాయిబాబాను సందర్శించుకున్న ప్రధాని మోదీ



**ముంబయి, అక్టోబర్ 26 :** ప్రధాని నరేంద్రమోదీ గురువారం మహారాష్ట్రలో పర్యటించారు. ప్రసిద్ధ శిర్డీ సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద దర్శన్ క్యూ కాంప్లెక్స్ ఆరంభించారు. ఈ పర్యటనలో ఆయన వెంట మహారాష్ట్ర గవర్నర్ రమేశ్ బైస్, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఉన్నారు. ఈ సందర్భంగా అహ్మద్‌నగర్ జిల్లాలోని నిల్వండే డ్యామ్‌కు ..మిగతా 2లో



# ఆగమాగమై ఓట్లు వేయొద్దు

## 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించలేదు

ఫ్లోరైడ్‌తో నడుములు వంగిపోతే పట్టించుకోనోడు..

నన్ను ఛాలెంజ్ చేస్తున్నడు : సీఎం కేసీఆర్

రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తున్నాం

ఇప్పుడు 3కోట్ల టన్నుల వరి పండుతోంది

చైతన్యవంతులైన నల్గొండ ప్రజలు ధన బేహార్లను తరిమికొట్టాలి

పూటకో పార్టీ మారే వాళ్లకు సిద్ధాంతాలు ఉండవు

ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

**మనుగోడు, అక్టోబర్ 26 (మనం న్యూస్):** యాభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించలేక పోయిందని సీఎం కేసీఆర్ అన్నారు. నల్గొండ జిల్లా మనుగోడులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. తెలంగాణ కోసం గొంతు ఎత్తింది ఎవరో.. ఉద్యమ కాలంలో నేతల కాళ్ల దగ్గర కూర్చున్నది ఎవరో గుర్తు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్లో కూడా 24 గంటలు కరెంటు లేదు.. కానీ, తెలంగాణలో 24 గంటల కరెంటు ఇస్తున్నామన్నారు. తెలంగాణలో 3 కోట్ల టన్నుల వరి పండుతోంది. రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం ఇస్తాం. పూటకో పార్టీ మారే వాళ్లకు సిద్ధాంతాలు ఉండవు. డబ్బు మదంతో పనిచేసే వాళ్లకు బుద్ధి చెప్పాలి. పాలమూరు-రంగారెడ్డి పూర్తయితే శివన్నగూడెం ప్రాజెక్టుకు నీళ్లు ఇస్తాం. మునుగోడు నియోజకవర్గంలో 2లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తాం. ఉప ఎన్నికలో చూపిన చైతన్యాన్ని మునుగోడు ..మిగతా 2లో

# ఇది ధర్మ యుద్ధం



మల్లన్న సాగర్ బాధితులు రోజు కూలీలుగా మారారు

ఇబ్బందులు తప్పవు.. కుట్రలు చేస్తారు

రేషమున్నోడే న్యాయం వైపు ఉంటాడు

ఏమిచ్చినా తీసుకోండి.. కమలానికి ఓటెయ్యండి

గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

గజ్వేల్ నాకు కొత్త కాదు.. మీతో నాకు 20 ఏళ్ల అనుబంధం ఉంది.. గజ్వేల్‌లో తొలి పౌల్ట్రీ ఫాం ఏర్పాటు చేసి నా జీవితం ప్రారంభించాను.. తెలంగాణ ఉద్యమం తొలినాళ్లలో గజ్వేల్లోనే ఎక్కువగా తిరిగాను.. సొంత ప్రాంతంలో తిరగాలని కేసీఆర్ చెప్తే.. హుజూరాబాద్లో ఉద్యమం నడిపాను.. తెలంగాణ ఉద్యమంలో నా పాత్ర ఏంటో ప్రజలందరికీ తెలుసు. నేను గజ్వేల్ వచ్చింది నాకు నియోజకవర్గం లేక కాదు.. 20 సంవత్సరాలు నాతో పని చేయించుకుని నా మెడలు పట్టుకుని బయటికి గెంటేశారు.. 2017లో మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తే 1700 మంది ఉద్యోగాలు తీసేశారు.. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కనికరం కూడా లేదు.. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే బ్రహ్మదేవుడు కూడా కాపాడలేడు అని సీఎం కేసీఆర్ అన్నారు.. గజ్వేల్లో ఎన్నికలు కురుక్షేత్ర యుద్ధం లాంటివి.. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అధికార పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయం.. బీఆర్ఎస్ ఎన్ని కుయుక్తులు, కుట్రలు చేసినా గెలిచేది బీజేపీ పార్టీనే.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రానుంది..

- ఈటల రాజేందర్

నాకు జీవితమంటూ ఉంటే కేసీఆర్‌పై పోటీ చేస్తా అని ఆనాడే చెప్పిన.. నేను గజ్వేల్‌కి ఏమిస్తానో తెలియదు కాని నా వల్ల మీ అందరి విలువ పెరిగింది.. నేను కేసీఆర్‌తో పైసల్లో పోటీ పడకపోవచ్చు.. నేను బక్క పలుచని వ్యక్తినే.. గజ్వేల్ ప్రజల అండ, ధర్మం, న్యాయంతో కేసీఆర్‌తో కొట్లాడుతా.. బీజేపీ ప్రభుత్వం వస్తే వందల ఎకరాల భూమి ఉన్న వాళ్ళకి, మామిడి తోటలు పెట్టె రైతులకు, ఇన్‌కమ్ టాక్స్ కట్టే వాళ్ళకి రైతు బంధు బంద్ చేస్తాం.. రైతు కూలి చనిపోతే మేం 5 లక్షల భీమా ఇస్తాం.. గజ్వేల్‌కి పట్టిన పీడ పోవాలంటే ఓటే మన ఆయుధం

ఈటల రాజేందర్ పిలుపు

వివరాలు.. 7లో



## దర్యాప్తు ప్రారంభానికి ముందే చంపేశారు

పోలీసుల తీరుపై రాజ్‌భవన్ మండిపాటు

వివరాలు.. 2లో

## పొన్నాల నిర్ణయంపై ఉత్కంఠ

ఢిల్లీకి రండి అంటూ పొన్నాలకు ఫోన్.. ఎన్నికల వేళ ట్విస్ట్!

రాహుల్ గాంధీ ఆఫీసు నుంచి ఫోన్

నాకు ఎవరూ ఫోన్ చేయలేదు

పొన్నాల లక్ష్మయ్య



# కామారెడ్డిలో పోటీకి సిద్ధమే



కేసీఆర్, కేటీఆర్‌ను చిత్తుగా ఓడించేందుకు సిద్ధం

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు..

నవంబర్ 2 లోగా సంక్షేమ పథకాల చెల్లింపులు విడుదల చేయాలి

సంక్షేమ పథకాల నగదు బదిలీపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశాం : రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 26 (మనం న్యూస్):** అధిష్ఠానం ఆదేశిస్తే కామారెడ్డిలో పోటీకి సిద్ధమేనని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వెల్లడించారు. తానైనా, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అయినా పార్టీ ఆదేశిస్తే కేసీఆర్‌పై పోటీ చేస్తామని తెలిపారు. ఢిల్లీలో ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో కలిసి మీడియాతో రేవంత్ మాట్లాడారు. 'కేసీఆర్, కేటీఆర్‌ను చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నాం. కొడంగల్ నుంచి పోటీ చేయాలని కేసీఆర్‌ను ఆహ్వానించా. కొడంగల్‌కు పోటీకి కేసీఆర్ రాకపోతే కామారెడ్డిలో పోటీకి నేను సిద్ధం' అని తెలిపారు. ఉమ్మడి ఏపీలో ప్రజలు ఎప్పుడూ హంగ్‌కు అవకాశం ఇవ్వలేదని.. తెలంగాణలోనూ హంగ్ ఎప్పుడూ రాలేదన్నారు. రెండింట మూడో వంతు మెజారిటీతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆయన ..మిగతా 2లో

# కాంగ్రెస్ అంటేనే రైతు వ్యతిరేక ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ రైతుల పట్ల ఉన్న వ్యతిరేకతను మరోసారి చాటుకుంది

రైతుబంధు ఆపాలని ఎలా ఫిర్యాదు చేస్తారు

కాంగ్రెస్‌పై హరీష్ రావు ఫైర్



**హైదరాబాద్, అక్టోబర్ 26 (మనం న్యూస్):** కాంగ్రెస్ పార్టీపై మంత్రి హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత కరెంట్ అంటూ కాంగ్రెస్ ఉత్త కరెంట్ చేసిందని ఎద్దేవా చేశారు. అన్నదాతలపై కాంగ్రెస్‌కు కనికరం లేదు. కాంగ్రెస్ అంటేనే రైతు వ్యతిరేక ప్రభుత్వం అని ఘాటు విమర్శలు చేశారు. కాగా, మంత్రి హరీష్ రావు గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో రైతులకు కేవలం ఐదు గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే రైతు వ్యతిరేక ప్రభుత్వం. ఎన్నికల్లో ..మిగతా 2లో



## పార్టీ ఆదేశిస్తే కేసీఆర్‌పై పోటీకి రెడీ

కేసీఆర్ కుటుంబ దుర్మార్గపు పాలన నుంచి తెలంగాణను విముక్తి చేయాలన్నదే నా ఆశయం

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 :** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భేటీ అయ్యారు. అరగంట పాటు సమావేశం జరిగింది. నేడు రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి రాజగోపాల్‌రెడ్డి చేరనున్నారు. మునుగోడు నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన రాజగోపాల్‌రెడ్డి.. పార్టీ ఆదేశిస్తే కేసీఆర్‌పై కూడా పోటీకి రెడీ అన్నారు. బీజేపీకి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాజీనామా చేసిన సంగతి ..మిగతా 2లో

## మళ్లీ అధికారం మాదే..

వంద సీట్లతో హ్యాట్రిక్ సర్కార్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**నిజామాబాద్, అక్టోబర్ 26 (మనం న్యూస్):** తెలంగాణలో మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దేనని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధీమా వ్యక్తం చేశారు. వంద సీట్లతో హ్యాట్రిక్ సర్కారు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిజామాబాద్లో మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె పలు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పథకాల సృష్టికర్త అని.. ఇతర పార్టీల మేనిఫెస్టోను కాపీ చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. బీజేపీకి తెలంగాణలో అవకాశమే లేదు. ఆ పార్టీ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయింది. కోరుట్లలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధర్మపురి ..మిగతా 2లో

## త్రిపుర గవర్నర్‌గా నల్లు ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేయించిన త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

గవర్నర్ బాధ్యతలు స్వీకరించిన నల్లు ఇంద్రసేనా రెడ్డి

స్వాగతం పలికిన సీఎం డా.మాణిక్ సాహు, మంత్రులు

వివరాలు.. 2లో



### మంచిమాట

ఎవరి ధనం కోసమో ,
ఎవరి బంధం కోసమో
మనం పాకులాడే
అవసరంలేదు.
మన మాట మన గుణం
బాగుంటే అవే మన
దగ్గరకు వస్తాయి.!

శుభోదయం



## స్వేచ్ఛగా ఓటేయండి

మీకు భరోసాగా మేమున్నాం

ప్రచారాన్ని అడ్డుకునే హక్కు ఏవరికి లేదు

హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీశ్

7

## బీఆర్ఎస్‌కు భారీ షాక్..

బీఆర్ఎస్ పార్టీకి కేఎస్ రత్నం రాజీనామా

నేడు బీజేపీలో చేరనున్న చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే

వివరాలు.. 2లో



## శిర్డీ సాయిబాబాను సందర్శించుకున్న ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

జల పూజ చేశారు. ఆ తర్వాత డ్యామ్ ఎడమకాలువను ప్రారంభించారు. 85 కి.మీ. మేర పొడవైన ఈ కాలువ వల్ల 182 గ్రామాలు లబ్ధి పొందనున్నాయి. అలాగే 'నమో షెత్కారీ మహాసన్మాన్ నిధి యోజన'ను ఆవిష్కరించారు. ఈ పథకం వల్ల మహారాష్ట్రలో 86 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు. వైద్య, రవాణా, ఇంధనం.. ఇలా పలు రంగాలకు సంబంధించి రూ.7,500కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపన చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వ కేటాయింపులు పెరుగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని వెల్లడించారు. మహారాష్ట్ర పర్యటన అనంతరం మోదీ గోవా వెళ్తారు. అక్కడ 37వ జాతీయ క్రీడల్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత క్రీడాకారుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తారని గోవా ప్రభుత్వం వెల్లడించింది. గోవా మొదటిసారి జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ క్రీడలు అక్టోబర్ 26 నుంచి నవంబర్ 9 వరకు జరగనున్నాయి.

## దర్యాప్తు ప్రారంభానికి ముందే చంపేశారు

చెన్నై, అక్టోబర్ 26 : తమిళనాడు రాజ్‌భవన్ వద్ద పెట్రోల్ బాంబు విసిరిన ఘటన కలకలం రేపిన విషయం విదితమే. చెన్నైలోని రాజ్‌భవన్ ప్రధాన గేటు వద్ద ఓ వ్యక్తి పెట్రోల్ సీసాను విసిరేశాడు. ఈ క్రమంలో ఆ వ్యక్తిని వెంటనే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని తమిళనాడులోని రాజ్‌భవన్ ఆక్షేపించింది. రాజ్ భవన్ గురువారం ఈ ఆరోపణ చేసింది. తమిళనాడు రాజ్ భవన్ పోలీసులపై ప్రశ్నలు సంధించింది. ఈ వ్యవహారంలో దర్యాప్తును ప్రారంభానికి ముందే చంపేసినట్లు వ్యాఖ్యానించింది. పోలీసులు దాడిని సాధారణ చర్యగా పేర్కొని, వివరంగా దర్యాప్తు చేయలేదని ఆయన ఆరోపిచింది. చెన్నైలోని రాజ్‌భవన్ గేటుపై పెట్రోల్ బాంబు విసిరిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఆ వ్యక్తి కొన్ని నెలల క్రితం నగరంలోని బీజేపీ కార్యాలయం వెలుపల ఇదే పని చేసేందుకు ప్రయత్నించాడు. పోలీసులు దాడిపై రాజ్‌భవన్ ఫిర్యాదును నమోదు చేయలేదు. సుమోటో దాడిని సాధారణ విధ్వంస చర్యగా పలచబరిచారు. తొందరపడి నిందితుడిని అరెస్టు చేసి (అతన్ని) అర్ధరాత్రి మేజిస్ట్రేట్ను మేల్కొలిపి (అతన్ని) జైలుకు తరలించారు. దీంతో ఈ దాడి వెనుక ఎవరున్నారనేది బహిర్గతం చేసే సమగ్ర దర్యాప్తును అడ్డుకున్నట్లయ్యింది. నిష్పాక్షిత దర్యాప్తును ప్రారంభానికి ముందే చంపేశారు' అని రాజ్‌భవన్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అయితే అక్కడికక్కడే ఉన్న పోలీసు సిబ్బంది ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజ్‌భవన్ ఫిర్యాదు రాత్రి 11 గంటల ప్రాంతంలో మాత్రమే అందిందని, అందులో పేర్కొన్న వివరాలను కూడా విచారణలో తీసుకుంటామని వారు చెబుతున్నారు. డీఎంకే అధికార మంత్రి ఎస్ రేగుపతి ఘటనను ఖండిస్తూ ఎలాంటి భద్రతా లోపం లేదని స్పష్టం చేశారు. రాజ్‌భవన్‌కు మంచి రక్షణ ఉంది. దర్యాప్తు జరుగుతోంది, భద్రతా లోపం లేదని మంత్రి కొట్టిపారేశారు. గత ఏడాది చెన్నైలోని బీజేపీ కార్యాలయం బయట పెట్రోల్ బాంబు విసిరిన కేసులో అరెస్టయిన వినోద్ ఎనిమిది నెలల పాటు జైలులో ఉన్నాడు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేందుకు ఇలా చేసి ఉంటారా అని మంత్రి అనుమానం వ్యక్తం చేశారు. గవర్నర్‌పై రాజ్‌భవన్‌లో డీఎంకె నేతలు, మిత్రపక్షాలు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాయంటూ రాజ్‌భవన్ చేసిన ఆరోపణలపై రేగుపతి స్పందిస్తూ.. 'గవర్నర్ ఆరోపణలపై ప్రజలకు అర్థమయ్యేలా మాత్రమే స్పందించాం. ఆయనపై మేమెప్పుడూ ద్వేషం పెంచుకోలేదు. తమిళనాడు అంతటా ద్వేషాన్ని వ్యాపింపజేసేది గవర్నర్ అని ఆయన అన్నారు.

## పొన్నాల నిర్ణయంపై ఉత్కంఠ

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఈరోజు ఒక పార్టీలో ఉన్న నేతల మరుసటి రోజు ఏ పార్టీలో చేరుతున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి తరుణంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఇటీవల బీఆర్ఎస్లో చేరిన పొన్నాల లక్ష్మయ్యకు రాహుల్ గాంధీ ఆఫీసు నుంచి ఫోన్ రావడం పొలిటికల్‌గా హాట్ టాపిక్‌గా మారింది. వివరాల ప్రకారం.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆఫీసు నుంచి పొన్నాల లక్ష్మయ్యకు గురువారం ఫోన్ కాల్ వెళ్లింది. ఈ సందర్భంగా పొన్నాల తిరిగి కాంగ్రెస్‌లో చేరాలనే ప్రతిపాదనను ఆయన ముందు ఉంచినట్టు సమాచారం. అలాగే, ఢిల్లీకి వచ్చి రాహుల్ గాంధీని కలవాలని రాహుల్ టీమ్ ఆయనను కోరింది. ఈ నేపథ్యంలో పొన్నాల నిర్ణయంపై ఉత్కంఠ చోటుచేసుకుంది.

మరోవైపు.. ఫోన్ కాల్‌పై పొన్నాల లక్ష్మయ్య స్పందించారు. ఈ సందర్భంగా పొన్నాల మాట్లాడుతూ.. నాకు ఎవరూ ఫోన్ చేయలేదు. తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నాను. 45 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ సేవ చేసిన పార్టీలో అనేక అవమానాలు భరించి.. నేను ఓ రాజకీయ నిర్ణయం తీసుకున్నాను. బీసీలను చీడ పురుగులు చూసినట్టు రేవంత్ రెడ్డి ప్రవర్తన ఉంది. ఇలాంటి చిల్లర ప్రచారాలకు ప్రభావితం అయ్యే వ్యక్తిని కాదు అంటూ ఘాటు విమర్శలు చేశారు. ఇదిలా ఉండగా.. సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య ఇటీవలే బీఆర్ఎస్‌లో చేరారు. జనగామలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. పొన్నాలకు కండువా కప్పి సీఎం కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం, పొన్నాల మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో ఉండి అవమానానికి గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. 45ఏళ్లు కష్టపడినా తనకుఫలితం దక్కలేదన్నారు. ముఖ్యమంత్రి అయిన మూడు నెలల్లోనే సమగ్ర కుటుంబ సర్వే చేయించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ అణగారిన వర్గాలను పైకి తీసుకురావడానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జనగామ ప్రాంతంలో 80వేల పాల ఉత్పత్తి జరుగుతుందని, వారికి ఉపాధి కల్పించే ఆలోచన చేయాలని కోరారు. బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# ఆగమాగమై ఓట్లు వేయొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు మళ్లీ చూపాలి. చైతన్యవంతులైన నల్గొండ ప్రజలు ధన బేహార్లను తరిమికొట్టాలి అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. గతంలో ఫ్లోరైడ్‌తో నడుములు వంగిపోతే పట్టించుకోనోడు.. నేడు నన్ను ఛాలెంజ్ చేస్తున్నారంటూ సీఎం కేసీఆర్ ధ్వజమెత్తారు. కారు గుర్తుకు ఓటేసి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. గతంలో మునుగోడులో ఉప ఎన్నిక జరిగితే మీరు తీర్పునిచ్చారు. ఆ సందర్భంగా పార్టీ తరపున, ప్రభుత్వం తరపున ఏవైతే హామీలు ఇచ్చామో అవి నెరవేర్చడం జరిగింది. దాదాపు 95శాతం పనులు చేశాం. చండూరు రెవెన్యూ డివిజన్గా ఏర్పాటు చేశాం. వందపడకల హాస్పిటల్ నిర్మాణమవుతుంది. మిగతా పనులన్నీ మీ కండ్ల ముందుట ఉన్నాయ్' అని తెలిపారు. 'ఎన్నికలు వచ్చినప్పుడు నేను మిమ్మల్ని కోరేది ఒక్కటే. గత ఎన్నికల్లోనూ కోరాను.. ఈ సారి కూడా కోరేది ఏంటంటే.. ఆగమాగమై ఓట్లు వేయొద్దు. ఎవరో ఏదో చెబితే క్యారీ ఫార్వర్డ్ అయిపోవద్దు. మనంగా ఆలోచించి స్వయంగా నిర్ణయాలు తీసుకోవాలి. మునుగోడు కోసం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అంతకుముందున్న కాంగ్రెస్ 50-60 సంవత్సరాలు పరిపాలించినా ఇక్కడ నడుములు వంగిపోయేదాకా.. చచ్చిపోయేదాక చూశారే తప్పా ఫ్లోరైడ్ నివారణ కోసం కృషి చేయలేదు. అటల్ బిహారి వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్న సమయంలో.. ఇక్కడి ఉద్యమకారులు స్వామి అనే పిల్లవాడిని ప్రధాని టేబుల్‌పై పడుకొబెట్టినా.. దానికి నివారణ దొరకలేదు. కానీ బీఆర్ఎస్ పార్టీ వచ్చాకనే ఫ్లోరైడ్ నీళ్ల గోస ఏ విధంగా పోయిందో మీ అందరికీ తెలుసు. అనేక కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయో చూస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎవరూ లేరు. పిడికెడు మందిమే ఉన్నాం. ప్రభాకర్‌రెడ్డి ఆ నాటి నుంచి ఈ నాటి వరకు ఉద్యమంలో ఉన్నారు. ఆ నాటి నుంచి ఈనాటి వరకు ఉద్యమంలో నా వెంట ఉన్నారు. మడమ తిప్పకుండా పోరాటం చేస్తున్నారు. ఆ నాడు ఎక్కడెక్కడున్నోళ్లు.. ఎవల బూట్లు మూసినోళ్లు.. ఇవాళ ఛాలెంజ్‌లు చేస్తున్నారు' అన్నారు.

**వారికి బుద్ధి చెప్పాలి..**

గవర్నమెంట్ వచ్చి పదేళ్లయిన ఈ సందర్భంలో.. ఎన్నికలు వస్తే 24 ఏళ్ల కిందట పత్తాలేని నాడు.. గొడగొడ ఏడ్చిన నాడు.. పంటలు ఎండిపోయిన నాడు.. ఫ్లోరైడ్‌తో నడుములు వంగిపోయిన నాడు.. పట్టించుకోనోడు.. వాళ్లు ఎక్కడక్కడున్నారో మీకు తెలుసు. ఈ రోజు నన్ను ఛాలెంజ్ చేస్తున్నారు. మీ అందరినీ నేను కోరేది ఒక్కటే. తెలంగాణ ఉద్యమంలో ఎవరు మనతో ఉన్నరు.. ఎవరు లేరో మీకు తెలుసు.. మీరు కళ్లారా చూశారు. అందువల్ల రాజకీయాల్లో ఎవరైతే పనికి మాలిన వాళ్లు ఉంటరో.. డబ్బు మదంతో పని చేసేవారుంటారో.. వాళ్లకు బుద్ధి చెప్పకపోతే ప్రజలు గెలువరు.. ప్రజలు ఓడిపోతరని మనవి చేస్తున్నానన్నారు.

## వలసల వనపర్తిని.. వరి పంటల వనపర్తి చేసిన మొనగాడెవరు?

వనపర్తి, అక్టోబర్ 26 (మనం న్యూస్): తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందిందో ప్రజలు గుర్తించాలని సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. వనపర్తిలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. కొందరు కాంగ్రెస్ నేతలు అక్కడికిరా.. ఇక్కడికి రా.. అంటున్నారు. 119 నియోజకవర్గాల్లో కేసీఆర్‌లు ఉన్నారు.. వారితో తలపడాలి. ఉన్న తెలంగాణ ఊడగొట్టిందెవరు? తెలంగాణ కోసం కొట్లాడిందెవరో ప్రజలు ఆలోచించాలి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే వనపర్తిలో లక్ష ఎకరాలకు నీరు అందుతోంది. వలసల వనపర్తిని.. వరి పంటల వనపర్తిగా చేసిన మొనగాడెవరు? ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గతంలో ఎంతో మంది మంత్రులుగా పని చేశారు.. కానీ, ఒక్క వైద్య కళాశాల కూడా తీసుకురాలేకపోయారు. మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి పట్టుబట్టి.. అయిదు మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారు. ముస్లింలను కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటు బ్యాంకుగానే చూసింది. వారి అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. తెలంగాణ గురుకులాల్లో ఇవాళ వజ్రాల్లాంటి విద్యార్థులు తయారవుతున్నారు. ఓట్ల కోసం



అబద్ధాలు చెప్పం. మళ్లీ గెలిస్తే.. పింఛన్లను దశలవారీగా రూ.5వేలకు పెంచుతాం. రైతులకు ఏ ప్రభుత్వమైనా డబ్బులు ఎదురిచ్చిందా? ఎన్ని మోటార్లు పెట్టారని ఇవాళ రైతులను ఎవరైనా అడుగుతున్నారా? రైతులు కట్టాల్సిన కరెంటు బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తోంది. రైతుల భూమిపై వారికే అధికారం కట్టబెట్టాం. వారిపై వీఆర్వో, ఆర్ఐ, ఎమ్మార్వో పెత్తనం లేకుండా చేశాం. వనపర్తి గొప్ప పట్టణంగా వెలుగొందుతుంది అని సీఎం కేసీఆర్ అన్నారు.

# కామారెడ్డిలో పోటీకి సిద్ధమే

(మొదటిపేజీ తరువాయి)

ధీమా వ్యక్తం చేశారు.

**ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు..**

ఎన్నికల నియమావళిని బీఆర్ఎస్ నేతలు ఉల్లంఘిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. నియమావళి ఉల్లంఘనపై కేంద్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. 'సంక్షేమ పథకాల నగదు బదిలీపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశాం. పార్టీ కార్యకర్తల్లా పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని కోరాం. నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులను నియమించాలని విజ్ఞప్తి చేశాం. విశ్రాంత అధికారులకు పదవులు ఇచ్చి ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టేందుకు ప్రైవేటు ఆర్మీలా వాడుతున్నారు. విశ్రాంత అధికారులను తక్షణమే విధుల నుంచి తొలగించాలని కోరాం. విశ్రాంత అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. ప్రభుత్వ జీతభత్యాలతో ప్రైవేటు ఆర్మీని నియమించారు. కొత్త ఆర్మీతో కాంగ్రెస్ నేతలపై దాడులు చేయించి కేసులు పెడుతున్నారు. కీలకమైన శాఖలను కొందరు ఐఏఎస్లు 7-8 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. జయేశ్ రంజన్, అర్వింద్ కుమార్, సోమేశ్ కుమార్ కీలక శాఖలు నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్‌కు ఎన్నికల నిధులు ఇవ్వాలని వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నారు' అని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.

**మంత్రి కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కౌంటర్..**

బీఆర్ఎస్ మంత్రి కేటీఆర్ గురువారం ట్విట్టర్ వేదికగా కాంగ్రెస్ పార్టీపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రైతు బంధు నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది.. కాంగ్రెస్ అంటేనే రైతు విరోధి అని, అన్నదాత పాలిట నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ అని కేటీఆర్ తీవ్రంగా దుయ్యబట్టారు. అయితే, ఈ పోస్ట్‌పై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మంత్రి కేటీఆర్‌కు కౌంటర్ ఇచ్చారు. 'ఆడలేక మద్దెల ఓడు అంటున్నావా డ్రామారావు.. నీకు రైతులపై ప్రేముంటే నవంబర్ 2 లోపు రైతుబంధు డబ్బులు ఇవ్వు, నీకు వృద్ధులపై శ్రద్ధ ఉంటే నవంబర్ 2 లోపు ఫించన్ ఇయ్యి, నీకు ఉద్యోగులపై బాధ్యత ఉంటే నవంబర్ 2 లోపు అందరు ఉద్యోగులకు జీతాలు ఇవ్వు, బుధవారం మేం ఎలక్షన్ కమిషన్‌కు చెప్పింది ఇదే, నీలాంటి వాడిని చూసే.. 'నిజం చెప్పులు తొడుక్కునే లోపు.. అబద్ధం ఊరంతా తిరిగొస్తుంది' అనే సామెత పుట్టింది అని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. డ్రామాలు ఆపి.. నవంబర్ 2 లోపు లబ్ధిదారులకు నిధులు ఇవ్వు.. లేదంటే కాంగ్రెస్ వచ్చి పెంచిన మొత్తంతో కలిపి ఇస్తుంది అని ఆయన పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలకు ముందే నగదు బదిలీ కార్యక్రమాలు పూర్తిచేయాలని ఈసీని కోరామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు.

# త్రిపుర గవర్నర్‌గా నల్లు ప్రమాణ స్వీకారం

అగర్తలా, అక్టోబర్ 26: త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనా రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. గురువారం అగర్తలాలో త్రిపుర హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన గవర్నర్‌కు సాయుధ దళాలు గార్డ్ ఆఫ్ హానర్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రముఖులను ముఖ్యమంత్రి కొత్తగవర్నర్ కు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాని కార్యాలయ అధికారులు, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు. గవర్నర్ దంపతులు బుధవారం అగర్తలా చేరుకోగానే వారిని ముఖ్యమంత్రి డాక్టర్ మాణిక్ సాహా, అతని మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు విమానాశ్రమయంలో ఘన స్వాగతం పలికారు. అక్కడ కొత్త గవర్నర్‌గా గార్డు-ఆఫ్-హానర్ నిర్వహించారు. అనంతరం తన నియామకంపై రాష్ట్రపతికి, ప్రధానికి, కేంద్ర హోం మంత్రి అమిత్షాకు నల్లు ఇంద్రసేనా రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. విమానాశ్రయం నుండి గవర్నర్ దంపతులు రాజ్ భవన్‌కు చేరుకుని గురువారం ఉదయం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం చేశారు. అనంతరం రాజభవన్‌లో ముఖ్యమంత్రి డాక్టర్ మాణిక్ సాహ, సీనియర్ అధికారులతో నల్లు ఇంద్రసేనా రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ఈసందర్భంగా గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ అధికారులు పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, సాధారణ పౌరులు సైతం సాధికారత సాధించేలా అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అనేకమంది ప్రజా ప్రతినిధులు, నాయకులు గవర్నర్ కు అభినందనలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన అభిమానులు పూల దండలతో సత్కరించారు . రాజభవన్ లో గవర్నర్ దంపతులు ఎట్- హోం హై-టీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఎ మాణిక్ సాహాతో పాటు, మంత్రులు, అధికారులు, న్యాయమూర్తులు హాజరయ్యారు.

## బీఆర్ఎస్‌కు భారీ షాక్..

చేవెళ్ల, అక్టోబర్ 26 (మనం న్యూస్): బీఆర్ఎస్ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ స్థాపించినప్పటి నుంచి మీతో కలిసి పని చేసే అవకాశం ఇచ్చినందుకు మరియు నన్ను మీ కుటుంబంలో ఒక్కడిగా ఆదరించినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం లేఖలో పేర్కొన్నారు. కానీ, గత పది సంవత్సరాల నుంచి నాకు పార్టీలోఎలాంటి ప్రాధాన్యత లేకపోయినప్పటికీ మీ మీద గౌరవంతో ఒక కార్యకర్తగా నేను పార్టీలో కొనసాగుతూ వచ్చాను.. కానీ మీరు చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థి ఎన్నిక చేయడం పట్ల తీసుకున్నటువంటి నిర్ణయం నాకు చాలా బాధ కలిగించింది.. నేను చేవెళ్ల నియోజకవర్గం ప్రజల కోసం వాళ్ళ కోరిక మేరకు అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయదలచుకు న్నాను.. కావున పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని అనే విషయాన్ని మీకు తెలియజేసుకుంటున్నాను అంటూ ఆయన చెప్పుకొచ్చారు. అయితే, బీఆర్ఎస్ పార్టీకి కేఎస్ రత్నం రాజీమానా చేయడంతో చేవెళ్ల నియోజకవర్గంలో భారీ రాజకీయ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రధాన పార్టీల మధ్య పోటీ రసవత్తరంగా సాగే ఛాన్స్ కనిపిస్తుంది. తాజాగా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం కమలం గూటికి చేరుతున్నారు.. ఆయనకు చేవెళ్ల టికెట్ కూడా దాదాపు ఖరారైందని తెలుస్తుంది. ఇక, నేడు ఆయన బీజేపీలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్లు సమాచారం. దీంతో బీజేపీకి సైతం ఇక్కడ బలమైన అభ్యర్థి దొరికినట్లేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇన్నాళ్లు ఇక్కడ బీజేపీ నుంచి పోటీ చేసిన వారిలో ప్రభావం చూపే నేతలు లేకపోవడంతో పార్టీలో మార్పు కనిపించలేదు.. ఇక, మాజీ ఎమ్మెల్యేగా పనిచేసిన రత్నం నియోజకవర్గ ప్రజలకు తెలిసిన వ్యక్తి.. సొంత కేడర్ ఉండటంతో ఈసారి హోరాహోరీ పోరు తప్పదని ఓటర్లు పేర్కొంటున్నారు. ఇక, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా కేఎస్ రత్నం చేసిన సేవలు బీజేపీకి కలిసొస్తాయని కమలం పార్టీ భావిస్తోంది. అయితే, అధికార పార్టీలోనే కొనసాగిన రత్నం తనకు టికెట్ రాకపోవడంతో పార్టీలోని తన మద్దతుదారులతో టికెట్ ఇవ్వాలని అధిష్టానంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నం చేశాడు.. కానీ, బీఆర్ఎస్ సిట్టింగులకే సీట్లు ఇవ్వడంతో మరోసారి కాలె యాదయ్యకు ఎమ్మెల్యేగా అవకాశం వచ్చింది. దీంతో కాలె యాదయ్యను ఓడించి తీరుతామని కేఎస్ రత్నం బహిరంగంగానే పలుసార్లు ప్రకటించారు. తాజాగా ఆయన కార్యకర్తలతో మాట్లాడిన తర్వాత.. బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వకపోయినా.. తప్పకుండా ఈ సారి చేవెళ్ల నుంచి పోటీలో ఉంటానని చెప్పారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి ఎలాంటి సపోర్ట్ రాకపోవడంతో ఆయన బీజేపీ వైపు మొగ్గు చూపించారు. ఈ పరిణామం బీఆర్ఎస్కు భారీ షాక్ తగిలింది. అధికార పార్టీకి చెందిన నేతలు ఆయనతో పాటే బీజేపీలోకి వెళ్లే అవకాశం ఉండటంతో గులాబీకి ఇబ్బంది తప్పదని పొలిటికల్ సర్కిల్ లో టాక్ నడుస్తోంది.

## నేడు వరంగల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు..

వరంగల్, నేడు వరంగల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు పెట్టినట్లు నగర పోలీస్ కమిషనర్ తెలిపారు. నేడు వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పర్యటన సందర్భంగా భారీ వాహనాలకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వరంగల్లోని బట్టుపల్లి, కడిపికొండ మార్గంలో ఎస్ఆర్ స్కూల్ రోడ్డులో భారీ వాహనాలకు ట్రక్కులు కడిపికొండ ఫ్లైఓవర్ మీదుగా అనుమతించబడవు అని తెలిపారు. కాబట్టి హైదరాబాద్ నుంచి వరంగల్, ఖమ్మం నుంచి వచ్చే భారీ వాహనాలు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దగ్గర గల ఓఆర్ఆర్ మీదుగా, ఎనుమాముల మార్కెట్, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్రోడ్డు మీదుగా ఖమ్మంకు వెళ్ళ వలసి ఉంటుంది అని పోలీసులు వెల్లడించారు. అదే విధంగా ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్ల వలసిన భారీ వాహనాలు నాయుడు పంపు నుంచి పోర్టు రోడ్డు, తెలంగాణ జంక్షన్, ఎనుమాముల మార్కెట్ నుంచి ఫ్లైఓవర్ మీదుగా హైదరాబాద్ కు వెళ్ళ వలసి ఉంటుంది అని వరంగల్ పోలీసులు వెల్లడించారు. సీఎం కేసీఆర్ మీటింగ్ జరిగే ప్రదేశంలో ఎలాంటి ట్రాఫిక్



అంతరాయం కలగకుండా ఉండేందుకు గానూ.. ట్రై సిటీ పరిధిలో భారీ వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ట్రాఫిక్ ఆంక్షల్లో భాగంగా తేదీ: 27-10-2023 మధ్యాహ్నం 12.00 నుంచి సాయంత్రం 06.30 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.

## పార్టీ ఆదేశిస్తే కేసీఆర్‌పై పోటీకి రెడీ

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. 'కేసీఆర్ కుటుంబ దుర్మార్గపు పాలన నుంచి తెలంగాణను విముక్తి చేయాలనే నా ఆశయం. మరో ఐదు వారాల్లో నెరవేరుతుందని భావిస్తున్నాను. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉంది. ప్రజలు మార్పును కోరుకుంటున్నట్టు స్పష్టమవుతోంది' అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచే కాంగ్రెస్ అభ్యర్థులను ఆ పార్టీ అధిష్టానం దాదాపుగా ఖరారు చేసింది. కమ్యూనిస్టులకు వదిలేసిన స్థానాలు, కొత్తగా నేతల చేరిక ఉండే సీట్లు, పోటీ ఎక్కువగా ఉన్న కొన్ని స్థానాలు మినహా 50కిపైగా అభ్యర్థుల పేర్లతో మలి జాబితాను సిద్ధం చేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో ఆమోదించిన ఈ జాబితాను ఏ క్షణమైనా విడుదల చేసే అవకాశం ఉందని పీసీసీ వర్గాలు చెప్తున్నాయి.

## కాంగ్రెస్ రైతు వ్యతిరేక వైఖరిని ఎండగట్టాలి

**రైతుల పట్ల కాంగ్రెస్ వైఖరిపై**
**గ్రామ స్థాయి నుంచి నిరసన**
**బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు**

హైదరాబాద్, అక్టోబర్ 26 (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తోన్న రైతు వ్యతిరేక వైఖరిని ఎండగట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతుబంధు ఆపాలన్న కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించాలన్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులలో



టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. 'రైతుల పట్ల కాంగ్రెస్ వైఖరిపై గ్రామ స్థాయి నుంచి నిరసన తెలపాలి. రైతులను ఇబ్బంది పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అక్కసుతో రైతుబంధు ఆపేందుకు యత్నించింది. ఇప్పటికే రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నాం. ఎన్నికల కోడ్ పేరుతో రైతులకు సాయం అపాలని కాంగ్రెస్ యత్నిస్తోంది. కాంగ్రెస్ అంటే రైతు విరోధి అని మరోసారి రుజువైంది. అన్నదాతల పాలిట ప్రథమ శత్రువు కాంగ్రెస్. కపట కాంగ్రెస్ పార్టీ కుట్రను అన్నదాతలు సహించరు అని కేటీఆర్ అన్నారు.

## కాంగ్రెస్ అంటేనే రైతు వ్యతిరేక ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలో 61 లక్షల మంది రైతులు కాంగ్రెస్ డిపాజిట్లు గల్లంతు చేస్తారు. రైతుబంధు అనేది కొత్త పథకం కాదు. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వంలో పదకొండు సార్లు రైతు బంధు అందించాం. 12వ సారి ఇవ్వబోతుంటే ఇప్పుడు ఎన్నికల కమిషన్కు కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. కరోనా కష్ట కాలంలో కూడా రైతులకు రైతుబంధు ఇచ్చాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు బంధుకు రాంరాం అంటారు. రైతుబంధును నిలిపివేయాలని ఈసీని కాంగ్రెస్ ఎలా కోరుతుంది?. రైతుబంధు అందకుండా కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది. స్వయంగా తెలంగాణ పీసీసీ ప్రెసిడెంట్ మూడు గంటల కరెంట్ ఇస్తామన్నారు. డిసెంబర్ మూడో తేదీ తర్వాత కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి అవుతారు. గత ప్రభుత్వాలు రైతుల నుంచి పన్ను కట్టించుకుంటే.. కేసీఆర్ రైతులకు డబ్బులు పంచారు. కాంగ్రెస్ నాయకులు ఏం చెప్పినా ఓట్లు వేయరు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పెన్షన్లు, కేసీఆర్ కిట్ కూడా అపమంటారేమో అనిపిస్తోంది. రైతుల జోలికి వస్తే ఖబర్దార్ అని హెచ్చరిస్తున్నాము. కర్ణాటక ప్రజలు కొడంగల్, గద్వాల్లో కరెంట్ విషయంలో ఆందోళన చేశారు. రైతు రుణమాఫీ కోసం ఎన్నికల సంఘానికి లేఖ రాశాము అంటూ కామెంట్స్ చేశారు.

## మళ్లీ అధికారం మాదే..

(మొదటిపేజీ తరువాయి)

అర్వింద్ను ఓడిస్తాం. గాంధీలకే గ్యారంటీ లేదు.. కాంగ్రెస్ గ్యారంటీలను ఎవరు నమ్ముతారు? మైనార్టీలను కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోంది. ఈ ఎన్నికలు రాహుల్ వర్సెస్ రైతులుగా ఉంటాయి అని కవిత అన్నారు.

## కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించిన ఆర్జీ-3 జీఎం



రామగిరి, అక్టోబర్ 26, మనం న్యూస్ : కోల్ ఇండియా స్థాయిలో సింగరేణి సంస్థ పేరు నిలబెట్టాలని ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకర్‌రావు అన్నారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆర్జీ-3 మరియు ఏపీఏ ఏరియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కంపెనీ స్థాయి వాలీ బాల్ పోటీలను గురువారం రాణి రుద్రమాదేవి క్రీడా ప్రాంగణమునందు ఆర్జీ-3 జీఎం ఎన్,సుధాకర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని,పతాక ఆవిష్కరణ గావించి ప్రారంభించారు. ఈ పోటీల్లో 6 రీజియన్ల జట్లు (బెల్లంపల్లి/మందమ ర్రి)(కాల్వశ్రీరాంపూర్)(ఆర్జీ-1 అండ్ 2)(ఆర్జీ-3 /భూపాలపల్లి)(మణుగూరు/ఇలందు)(కార్పొరేట్/కొత్తగూడెం ఏరియా)క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఉద్యోగుల కోసం క్రీడలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి క్రీడా కారుడు నైపుణ్యాన్ని పెంచుకొని రాణించాలని అన్నారు. కోల్ ఇండియా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని సింగరేణి సంస్థ పేరు నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎంలు డి.బైద్య,జీ.రఘుపతి,పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్‌రెడ్డి, గౌరవ కార్యదర్శి వి.సునీల్ ప్రసాద్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్వైజర్ నరేందర్‌రెడ్డి, డివైపి ఎం.గుర్రం శ్రీహరి, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్శ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ బూసీ వెంకటేశ్వర్లులతో పాటు ఇతర అధికారులు, స్పోర్ట్స్ సూపర్వైజర్‌లు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సెంటినరీకాలనీ డిస్పెన్సరిని తనిఖీ చేసిన ఆర్జీ-3 జీఎం



రామగిరి, అక్టోబర్ 26, మనం న్యూస్ : సెంటినరీకాలనీ సింగరేణి డిస్పెన్సరిని గురువారం ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవల కోసం వస్తున్నటువంటి ఉద్యోగులతో మాట్లాడి వైద్య సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా డిస్పెన్సరీలో అందిస్తున్నటువంటి వివిధ వైద్య సౌకర్యాలను పరిశీలించారు. అంతేకాకుండా నవంబర్ 2న నిర్వహించబడే 54 వ భద్రత పక్షోత్సవాల్లో భాగంగా డిస్పెన్సరీలో తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. వీరితో పాటు ఎస్ ఓటు జిఎం జి.రఘుపతి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సిహెచ్. వెంకటరమణ, సివిల్ డీజీఎం పద్మరాజు, పర్సనల్ మేనేజర్ ఎం.రవీం దర్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, సీనియర్ సెక్యూరిటీ అధికారి ఈ లక్ష్మీనారాయణలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతులతో పెట్టుకుంటే కాంగ్రెస్‌ను బొంద పెడుతరు జాగ్రత్త

- శెంకేషి రవీందర్,రామగిరి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు
- మేదరవేన కుమార్ యాదవ్ రైతు బంధు అధ్యక్షుడు



రామగిరి, అక్టోబర్ 26, మనం న్యూస్ : తెలంగాణ రైతాంగానికి రైతు బంధు రైతు కాతాలో వెయ్యొదు,రుణమాఫీ చేయద్దని కాంగ్రెస్ పాఇర్టీ ఈసీకి ఇచ్చిన ఫిర్యాదును కండిస్తు రామగిరి మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలియజేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని నాల్లు రైతుల సంక్షేమం కోసం ఏమి చేయ్యలేదని గురువారం అధికార బిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ రైతుల పక్షాన నిలబడి రైతు బంధు, రైతు బీమా, ఋణ మాఫీ,24 గంటల కరెంటు,ఎరువుల కొరత లేకుండా రైతులకు ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా ధాన్యం కొనుగోలు చేసి వాళ్ళ అకౌట్‌లల్లో డబ్బులు జమచేసి రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఉంటే కండ్లు ఓర్వని కాంగ్రెస్ నాయకులు రైతుబంధు,ఋణ మాఫీ, చేయొద్దని ఈసీ కిఫిర్యాదు చేసినందుకు తెలంగాణా రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని రైతుల పట్ల ఇలాంటి వ్యతిరేక చేష్టలు చేస్తే తెలంగాణ రైతాంగం కాంగ్రెస్ పార్టీని బొందపెట్టడం కాయం అని తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చింతపట్ల నాగరాజు, నాయకులు పీవీరావు, గాజుల ప్రసాద్, కాపురబోయిన భాస్కర్, చిందం రమేష్, భూర్గ రాజు, దుబ్బాక సత్యారెడ్డి, దమెర శ్రీను, కలవేన సదానందం, జాపతి శేఖర్, తుమ్మల అశోక్, బత్తిని ప్రశాంత్, ఉగ్గే కుమార్, అమ్ముల కృష్ణా, చిప్ప సత్యం, ఎంజాల ఓదెలు, ఇజ్జగిరి సాకేత్, వరుణ్, కైలాస్, ముక్కెర కుమారస్వామి, సదానందం, గెల్లు భార్గవ్ తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- 24 గంటలు షిఫ్టులు వారీగా విధులు నిర్వహించాలి
- ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి
- జిల్లా కలెక్టర్,ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్





మంథని,అక్టోబర్ 26,మనం న్యూస్ : చెక్ పోస్ట్ వద్ద అధికారులు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ మంథని మండలం ఏక్లాస్‌పూర్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలో నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని జప్తు చేసిన నగదును రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత వ్యక్తులకు రసీదు తప్పనిసరిగా అందజేయాలని కలెక్టర్ సూచించారు. చెక్ పోస్ట్ వద్ద సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. 24 గంటలు చెక్ పోస్ట్ వద్ద షిఫ్టుల విధానంలో అధికారులు విధులు నిర్వహించాలన్నారు. పోలీస్ అధికారులు,స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలు సమన్వయంతో చెక్ పోస్ట్ వద్ద పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పై అధికారలుఉ తనిఖీ చేసే సమయంలో రికార్డులు చూపించి పకడ్బందిగా రికార్డ్ నిర్వహణ చేయాలని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో మంథని రిటర్నింగ్ అధికారి హనుమానాయక్, తహసీల్దార్ రాజయ్య, పోలీస్ అధికారలుఉ, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం నియమ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ఎక్సైజ్ సీఐ గురవయ్య



మంథని,అక్టోబర్ 26, మనం న్యూస్ : తెలంగాణలో రాష్ట్ర సాధారణ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మంథని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో అక్రమంగా జరిపే గుడుంబా,మద్యం నియమ నిబంధనలలో భాగంగా ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మంథని ఎక్సైజ్ సీఐ గురవయ్య హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో తమ కార్యాలయంలో మాట్లాడుతూ మంథని డివిజ న్ పరిధిలోని ముత్తారం, మంథని, రామగిరి, మాన్వూర్, మండలాలలో ఎవరైనా అనాధికారికంగా బెల్లం, గుడుంబా, గంజాయి, రవాణా చేసిన బెల్ట్ షాపులు నడిపిన వారిపై చట్టపరంగా కేసులు చేయడం జరుగుతుం దన్నారు. మంథని డివిజన్ పరిధిలోని షాపులతో పాటు బార్ అండ్ రెస్టా రెంట్‌పై ఎన్నికల నియమ నిబంధనలలో భాగంగా చట్టపరంగా నిబంధ నలను విధించడం జరిగిందన్నారు. మద్యం షాపుల నిర్వాహకులు షాపు లను ఉదయం 10 నుండి రాత్రి 10 గంటల వరకు షాపులు నడుప వల నని, ఆర్-1,ఆర్-2 రిజిస్టర్లు సరుకుకు సంబంధించినవి ఎప్పటికప్పుడు వ్రాసి ఉంచాలని ఆయన తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎప్ప టికప్పుడుపై అధికారుల ఆదేశాల మేరకు వారి పర్యవేక్షణలో గుడుంబా స్థావరాలు, బెల్ట్ షాపులపై వి స్త ృతదాడులు చేయడం జరుగుతుందన్నా రు. పూర్తిగా గ్రామాల్లో గుడుంబా నిర్మూలన చేయడం జరిగిందని, ఎక్క డైనా గుడుంబా తయారి, అమ్మకం లేదా సరఫరా జరిగినచో తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు. మంథని పోలీస్ శాఖ సహకా రంతో దాడులు చేయడం జరుగుతుందన్నారు. అక్రమంగా గంజాయి సరఫరా కలిగి ఉన్న వ్యక్తుల పై తగు సమాచారముతో దాడులు జరిపి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కొన్ని రాజకీయ పార్టీల వారికి మద్యం దుకాణాల యజమానులు చిట్టీల రూపంలో మద్యం బాటిళ్లు సరఫరా చేస్తున్నారనే సమాచారం తమ వద్ద ఉందని డివిజన్ పరిధిలోని గ్రామాల్లో గుడుంబా, బెల్టు షాపుల్లో అక్రమ మద్యం దుకాణాలపై నిఘా ఉంచడం జరిగిందన్నారు. మద్యంపై నిఘ పెట్టి తనిఖీలు చేయడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అక్రమ మద్యం దుకా ణాలు, గంజాయిపై ప్రజలు 8712658820,8019536636 నంబర్లకులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. 2023 జూన్ నుంచి ఈ నెల వరకు 138 కేసులు నమోదు చేశామని అందులో 70 బైండోవర్లు,72 మందిపై కేసులు నమోదు చేసమన్నారు. జరిపిన దాడుల్లో అక్రమంగా దొరికిన గుడుంబా, బెల్లంపానకం, బెల్లం, పట్టిక, మద్యం, బాటిల్లు, 10 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని రిమాండ్ చేశామన్నారు. 21 సంవత్సరాలు లోపు వ్యక్తులకు మద్యం విక్రయించరాదని, దుకాణాల్లో ఎలాంటి కల్తీ జరిగిన చట్టప్రకారం కేసులు నమోదు చేసి షాపులను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఎస్సై సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరిఖని ప్రాంతాన్ని బొందల గడ్డగా మార్చారు

- దోపిడి చేస్తున్న ఎమ్మెల్యేకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- ఒక అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా
- కాంగ్రెస్ అభ్యర్థి రాజ్ ఠాకూర్
- కాంగ్రెస్ చేరిన హమాలి, అసంఘటిత కార్మికులు



గోదావరిఖని, అక్టోబర్ 26, (మనం న్యూస్): ముఖ్యమంత్రి కెసిఆర్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతాన్ని బొందల గడ్డగా మార్చారని రామగుండం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆరోపించారు. గురువారం గోదావరిఖని లక్ష్మినగర్‌లోని వీరాంజనేయ హమాలి సహకార సంఘం అధ్యక్షులు పాతపెల్లి ఎల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో హమాలీలు, అసంఘటిత కార్మికులు రాజ్ ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పుట్టిన బిడ్డగా 25 సంవత్సరాలుగా నిరంతరం పోరాటం చేస్తూ మంచి చేయాలనే ఒక తపనతో ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలపై పోరాటం చేసుకుంటూ పోతున్నానన్నారు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే, అతని అనుచరులు ఆర్‌ఎఫ్సిఎల్ లో ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుండి లక్షల రూపాయలు వసూలు చేశారని, దానితో కొంతమంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. అలాగే ఈ ప్రాంతంలో ఇసుక దోపిడి, బూడిద దోపిడి, ఉద్యోగాల దోపిడి చేస్తూ కోట్ల రూపాయలు సంపాదించారని తెలిపారు. సింగరేణి కార్మికుల రక్తాన్ని చెమటగా మార్చి సంపాదించిన 500 కోట్ల రూపాయలతో మెడికల్ కాలేజి ఏర్పాటు చేసి, ఈ రోజు మేము మెడికల్ కాలేజి తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 200 యునిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, సొంత స్థలం ఉన్నవారికి ఐదు లక్షల రూపాయలు, మహిళలకు ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకు 2500 రూపాయలు, 4వేల రూపాయల పెన్షన్ ఇసామన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి తనకు ఒక అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అధికారులు కుమ్మక్కు

- నాకు న్యాయం చేయండి సింగరేణి నిర్వాసితుని ఆవేదన




మంథని, అక్టోబర్ 26,మనం న్యూస్ : మంథని మండలంలోని అక్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామసర్పంచ్, మంథని ఆర్డీవో అధికారులు కుమ్మక్కై తనకు అన్యాయం చేశారని అక్కపల్లి గ్రామపంచాయతీలోని సిద్ధపల్లికి చెందిన ఎండి రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్ధపల్లిలో 2010 నుండి నివాసం ఉంటున్న నాకు ముందుగా సింగరేణి అధికారులు చెల్లించే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మొదటి విడత స్ట్రక్చర్ పేమెంట్ 11 లక్షల 72 వేల రూపాయలు చెల్లించిన అధికారులు తదుపరి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించడం లేదని ఆయన గ్రామసర్పంచ్‌తో పాటు అధికారులపై తీవ్ర విమర్శలు చేశాడు. సర్పంచ్ రెవెన్యూ అధికారులు కుమ్మక్కై తనకు రావలసిన ప్యాకేజ్ నస్పూరి రాజమ్మ భర్త పేరు పోచాలు అనే వారికి కేటాయించినట్లు ఆయన ఆరోపించారు. గ్రామ సర్పంచ్, అధికారులు అమ్మమ్యాలకు ఆశపడి తనకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్త ం చేశాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూర్తి విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు. తనకు న్యాయం జరగని ఎడల ఎలాంటి పోరాటానికై సిద్ధమని ఆయన సందర్భంగా తెలిపారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



ముత్తారం, అక్టోబర్ 26, మనం న్యూస్ : ముత్తారం మండలంలోని మచ్చుపేట, మైదంబండ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను గురువారం మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. మచ్చుపేటలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి కుమారస్వామి తండ్రి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అదేవిధంగా మైదంబండ గ్రామానికి చెందిన వార్డ్ సభ్యుడు రేకుంట్ల రాజు నానమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,మద్దెల రాజయ్య, బియ్యని శివకుమార్,వాజిద్‌పాషా,గాదం శ్రీనివాస్,కోళ్ల విజయ్, అనుము గోపి,తదితరులు పాల్గొన్నారు.

## ముత్తారం మండలంలోని వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక

- బిఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు నచ్చకనే కాంగ్రెస్ పార్టీలోచేరిక
- మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు



ముత్తారం, అక్టోబర్ 26, మనం న్యూస్ : ముత్తారం మండ లంలోని ముత్తారం కేశనపల్లి హరిపురం, మచ్చుపేట గ్రామాల నుండి యువకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరగా గురువారం మాజీ మంత్రి మంథని ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బిఆర్ ఎస్ పార్టీ సిద్ధాంతాలు నచ్చకనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలకు ఆక ర్షితులై కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకు యువత కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే యువకులకు ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయని విద్యాపరంగా స్కాలర్షిప్లు ఇచ్చి ప్రభుత్వం యువతకు తోడ్పాటు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మద్దెల రాజయ్య, బియ్యని శివకుమార్, వాజిద్ పాష, కోళ్ల విజయ్, గాదం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు



మల్లాపూర్, అక్టోబర్ 26, (మనం న్యూస్): మండలంలోని చిట్టాపూర్ గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు గురువారం కోరుట్ల బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి సంజయ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధికి ఆకర్షితులై డాక్టర్ సంజయ్‌కు మద్దతుగా పార్టీలో చేరినట్లు తెలిపారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 26, (మనం న్యూస్): మార్క్‌ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల డిసిఓ మాదాసు సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యత నిబంధనలు పాటిస్తూ తమకు చెందిన మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఈ ప్రారంభోత్సవంలో జిల్లా మేనేజర్ దివ్యభారతి, మార్క్ ఫెడ్ సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నీరటి సురేందర్, సొసైటీ సెక్రటరీ మంత్రి సతీష్ కుమార్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఎస్పీ అఖిల్ మహజాన్
- ఘనంగా పోలీస్ అమరవీరుల వారోత్సవాలు





రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 26, (మనం న్యూస్): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, కరీంనగర్, మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటి వారి సహకారంతో మెగా రక్తదాన శిబిర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. అనంతరం పోలీస్ అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ వారితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి అందరితో పాటు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ప్రతి ఒక్కరు రక్తదానం చేసే విధంగా డిఎస్పీలు, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పోలీస్ స్టేషన్ల పరిధిలో గత మూడు రోజుల నుండి ప్రతి గ్రామానికి వెళ్లి అవగాహన కల్పించామని తెలిపారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసే విధంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. విధి నిర్వహణలో కర్తవ్యమే లక్ష్యంగా ప్రాణత్యాగం చేసి అమరులైన పోలీసులను ఈ సమాజం ఎప్పటికీ మరువదన్నారు.వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజల ధన మాన ప్రాణాలను కాపాడుతూ సంఘవిద్రోహ శక్తుల చేతుల్లో బలైన అమర పోలీసులు వీరులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.రెగ్యులర్ పోలీసింగ్‌తో పాటు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు,రాష్ట్రంలో ఉన్నటువంటి ఎంతోమంది తలసేమియా, సికిల్ సెల్, అనీమియా,డెంగ్యూ వ్యాధిగ్రస్తులకు రక్తం చాలా అవసరం ఉన్నందున వారికి సహాయం కోసం అమర విరుల స్మరకర్థం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 600 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది,జిల్లాలోని యువకులు, బిఎస్ఎఫ్ సిబ్బంది సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు.రక్తదాన శిబిరంలో రక్తదానం చేసేందుకు పెద్ద సంఖ్యలో యువకులు ముందుకు వచ్చి ఉత్సాహంగా పాల్గొనడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీలు ఉదయ్ రెడ్డి, నాగేంద్రచరి, రవికుమార్, సి.ఐలు ఉపేందర్, సధన్ కుమార్, శశిదర్ రెడ్డి, కరుణాకర్, కృష్ణకుమార్,కిరణ్ కుమార్, అనిల్ కుమార్, ఎస్.ఐలు పోలీస్ సిబ్బంది, బిఎస్ఎఫ్ సిబ్బంది, యువకులు, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అద్యక్షులు గుడ్ల రవి, వరంగల్ అధ్యక్షులు శ్రీనివాస్, కరీంనగర్ అధ్యక్షులు కేశవరెడ్డి, మంచిర్యాల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలో పట్టుబడ్డ నగదు




మెట్‌పల్లి, అక్టోబర్ 26, (మనం న్యూస్): మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐదు లక్షల 50వేల రూపాయలు పట్టుబడ్డట్లు మలాపూర్ ఎస్సై నవీన్ తెలిపారు. దొరికిన రూపాయలకు సంబంధించి ఎలాంటి పత్రాలు ఆధారాలు చూపడకపోవడంతో సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పచెప్పినట్లు ఆయన తెలిపారు.

## అభివృద్ధి సంక్షేమమే బిఆర్ఎస్ ప్రభుత్వ ఆజెండా



వెల్గటూర్, అక్టోబర్ 26, (మనం న్యూస్): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని, బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణకు శ్రీరామరక్ష అని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఎండపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కొత్తపేట గ్రామానికి చెందిన 80 మంది మహిళలు, 30 మంది యువకులు బిఆర్ఎస్ అధ్యక్షులు సింహాచలం జగన్, నాయకులు జీరెడ్డి మహేందర్ రెడ్డి, రామడుగు రాజేష్, కోడి గంగయ్య, మహిళా కోఆర్డినేటర్ బూరగడ్డ మౌనిక జాడి దుహాంతరాణి ల అధ్వర్యంలో పార్టీలో చేరగా మంత్రి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

## డిసిసి మైనార్టీ సెల్ కార్యదర్శిగా అస్లాం చౌహు




కరీంనగర్, అక్టోబర్ 26, (మనం న్యూస్): జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ కార్యదర్శిగా మహమ్మద్ అస్లాం చౌహు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ తాజుద్దీన్ గురువారం ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా అస్లాం చౌహు మాట్లాడుతూ తన నియమాకానికి కృషి చేసిన జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి.తాజ్, నాయకులు నిహాల్ అహ్మద్, ఫిరోజ్ లకు కృతజతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషిచేసి, పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు.

## కార్యకర్తలకు బిఆర్ఎస్ అండగా ఉంటుంది




ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 26, (మనం న్యూస్): కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని జడ్పిటిసి సభ్యులు చీటి లక్ష్మణరావు అన్నారు. కార్యకర్తలు ఎవరికి ఏమైనా తాము ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇటీవల మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన ఇద్దరు బిఆర్ఎస్ కార్యకర్తల కుటుంబ సభ్యులను గురువారం చీటి లక్ష్మణరావు, ఎంపిపి పెల్లి రేణుకలు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి 2లక్షల చొప్పున 4 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, ఎంపిటిసి సభ్యులు పందిర్ల నాగరాణి పరుశురామ్ గౌడ్, ఎలగందుల అనసూయ నరసింహులు, పార్టీ పట్టణ అధ్యక్షులు బండారి బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు అందె సుభాష్, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులను కాంగ్రెస్ కష్టాలపాలు చేసింది

- వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించింది బిఆర్ఎస్
- గులాబీ జెండాను గెలిపించండి
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని, అక్టోబర్ 26, (మనం న్యూస్): సింగరేణి సంస్థలో వారసత్వ ఉద్యోగాలను పోగొట్టి, కార్మికులను కష్టాలు పాలు చేసింది కాంగ్రెస్ పార్టీ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం ఆర్జీ వన్ ఏరియా 2 ఇంక్లైన్ వద్ద ఎమ్మెల్యే చందర్ ప్రజా అంకిత యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను, కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరించింది బిఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. బొగ్గు బ్లాక్ ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఉంటేనే సింగరేణి గనులకు, కార్మికులకు మనుగడని సాధ్యమౌతుందన్నారు. గత ప్రభుత్వం వారసత్వ ఉద్యోగాలను రద్దు చేస్తే తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని కార్మిక వర్గం అంతా ఆందోళన చెందిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ కారుణ్య నియామకాల పేరుతో హక్కును పునరుద్ధరించాడని తెలిపారు. కారుణ్య నియామకాల ద్వారా 20వేల మంది కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు దక్కాయన్నారు.సకల జనుల సమ్మెలో కార్మికుల వేతనాలలో కోత విధించవద్దని తాను అసెంబ్లీలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. కార్మికుల పోరాట స్ఫూర్తిని అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కరోనా కాలపు వేతనంతో పాటుగా, తెలంగాణ ఇంక్రిమెంట్‌ను కూడా మంజూరు చేశారన్నారు. నాడు కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలంటే యూనియన్ నాయకులు సీఎం అపాయింట్మెంట్ కోసం నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ నేడు టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో సమస్యలు వెంటనే పరిష్కారం అవుతున్నాయన్నారు. సింగరేణి కార్మికులు దేశ సరిహద్దులో కాపలాకాసే సైనికులతో సమానమని, వారికి ఐటి నుంచి మినహాయింపు నివ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసినా పార్లమెంటులో ఆమోదించలేదన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే కేంద్రం మెడలు వంచైనా కార్మికుల ఐటీ రద్దుకు కృషి చేస్తామన్నారు. ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం 30 కోట్లతో ఐటీ పార్కు, స్పిన్నింగ్ మిల్ స్థానంలో అంతర్గాంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ఇటీవల మంత్రి కేటీఆర్‌తో శంకుస్థాపన చేయించడం జరిగిందన్నారు. డ్యూటీలకు వెళ్లడానికి అడ్డంకిగా ఉన్న 2ఇంక్లైన్ మోరి విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణం కోసం సీఎండి శ్రీధర్ గారితో మంత్రి కేటీఆర్ మాట్లాడడం జరిగిందన్నారు. సింగరేణి మెడికల్ కళాశాలలో కార్మికుల పిల్లల కోసం 5శాతం రిజర్వేషన్లు, కార్మికుల కోసం ప్రత్యేక వార్డు హక్కుగా సాధించుకోవడం జరిగిందన్నారు. కార్మికుల కోసం త్యాగాలు చేయని, హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు, ఉద్యమాలు చేయని, అభివృద్ధిని ఓర్వలేని కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఎన్నికల్లో మాయమాటలతో మీ ముందుకు వస్తున్నాయని, వాటిని చిత్తుగా ఓడించి, తగిన బుద్ధి చెప్పాలన్నారు.ఎన్నికల సమయంలో డబ్బు సంచులతో వచ్చే నాయకులను నమ్మవద్దన్నారు.సింగరేణి సంస్థ మనుగడ సాగించాలంటే, కార్మిక హక్కులు సాధించబడాలంటే బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోమారు అధికారంలోకి తీసుకురావాలని, బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిబిజికెఎస్ నాయకులు కెంగర్ల మల్లయ్య, నునె కొంరయ్య, గండ్ర దామోదర్ రావు, మాదాసు రామమూర్తి, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, నాయకులు జహిద్ పాషా, శేషగిరి, మండ రమేష్, పోలాడి శ్రీనివాస్ రావు, వడ్డెపల్లి శంకర్, వెంకటేష్, వంగ శ్రీనివాస్ గౌడ్, పీచర శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, పర్లపల్లి రవి, నూతి తిరుపతి , దాసరి శ్రీనివాస్, గాధం నందు, ముల్కల కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు అడ్డుపడుతోన్న కాంగ్రెస్, బిజెపిలకు తగిన బుద్ధి చెప్పాలి

- బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్



హుజురాబాద్, అక్టోబర్ 26, (మనం న్యూస్): రాష్ట్ర అభివృద్ధి కోసం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతుంటే ఎలాగైనా తెలంగాణ ప్రజలకు సంక్షేమ పథకాలు అందకుండా చేయాలని కాంగ్రెస్ బిజెపి పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక సిటీ సెంటర్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం బిజెపితో కుట్రలు పన్ని తెలంగాణ లో సంక్షేమ పథకాల అమలను అడ్డుకోవాలని వినతి పత్రం అందజేయడం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో అమలవుతున్న దళిత బంధు రైతు ,బీమా రైతు బంధు, ఆసరా పెన్షన్, షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి లాంటి సంక్షేమ పథకాలను ఎన్నికల కోడ్ నేపంతో ఆపాలంటూ కేంద్రానికి కాంగ్రెస్ పార్టీ విన్నవించడం చూస్తుంటేనే తెలంగాణపై వాళ్ళ కపట ప్రేమ బయటపడుతుందని అన్నారు. కర్ణాటక ఎన్నికల సమయంలో కూడా ప్రజలను మోసం చేసే వాగ్దానాలు ఇచ్చి గెలిచిన తర్వాత ఒక వాగ్దానం కూడా నిలబెట్టుకోలేకపోతుందని అన్నారు. గతంలో కూడా తెలంగాణ రాష్ట్రంలో రైతులకు మూడు గంటల కరెంటు సరిపోతుంది అంటూ మాట్లాడిన మాటలు ప్రజలు ఎవరు మరిచిపోరన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా టిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలన్నీ నిలబెట్టుకుంటూ మేనిఫెస్టోలో లేని సంక్షేమ పథకాలను కూడా అమలు చేసిన గొప్ప ప్రభుత్వం బిఆర్ఎస్ పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెపుతున్న ఆరు పథకాలు కూడా ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని తప్ప ప్రజల కోసం కాదని ఆయన అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబం అందుకుందని, ప్రజలంతా కేసీఆర్ వైపే ఉన్నారని ఆయన అన్నారు. కెసిఆర్ ఇటీవల ప్రవేశపెట్టిన మేనిఫెస్టో చూసి ఇక తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్‌ను ఓడించడం కష్టమేనని తెలిసి ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ బిజెపిలు ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణ ప్రజలు వాటన్నిటిని తిప్పికొట్టి మరోసారి బిఆర్ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు రవీందర్ రావు, సురేందర్ రెడ్డి, చింత శ్రీనివాస్, అశోక్, సంగెం ఐలయ్య, కొలిపాక సమ్మన్న, జిగురు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమావేశాలు, సభలను వీడియో రికార్డింగ్ చేయించాలి

- జిల్లా ఎన్నికల అధికారి బి. గోపి



కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 26 (మనం న్యూస్):అసెంబ్లీ ఎన్నికలకు ప్రకటన జారీ అయిన దృష్ట్యా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలను ఎస్ఎస్‌టి బృందాలు వీడియో రికార్డింగ్ చేయించాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ బి.గోపి తెలిపారు. గురువారం హుజురాబాద్ నియోజక వర్గ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్, రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటికే మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి కావడంతో సంబంధిత నియోజక వర్గాల స్ట్రాంగ్ రూమ్ లకు ఈవీఎం, కంట్రోల్ యూనిట్, వివిపాట్ లను తరలించడం జరిగిందని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్న అనంతరం పోలింగ్ కొరకు సామాగ్రిని తరలించడంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లను సమీక్షించుకోవాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. అనంతరం చెక్ పోస్ట్ చేరుకొని సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. వాహనాల తనిఖీని పకడ్బందీగా నిర్వహించాలని, తనిఖీ చేసే ప్రతివాహనానికి సంబంధించిన వివరాలు, సమయం తదితర వివరాలను రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. తనిఖీ లలో పట్టుబడే వాటి వివరాలను వెంటనే సంబంధిత బృందాలకు, రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని సూచించారు. ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది అందరు హాజరయేటట్లు అధికారులు ఆకస్మిక తనిఖీలను నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆర్వో కార్యాలయానికి చేరుకొని హుజురాబాద్ ఉప ఎన్నికలలో వచ్చిన నామినేషన్, నామినేషన్ల పరిశీలన, ఏర్పాటు చేసిన బృందాలు , వినియోగించిన సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లను స్వీకరించేటప్పుడు కచ్చితంగా సమయాన్ని నమోదు చేయాలని, ఉదయం 11 గంటలకు ముందు మధ్యాహ్నం 3 గంటల తరువాత వచ్చే నామినేషన్ లను స్వీకరించరాదని, ఆర్వో కార్యాలయంలో నామినేషన్ వేయడానికి వచ్చే వారికొరకు వెయింటింగ్ హాల్ ను ఏర్పాటు చేయాలని అన్నారు. అదేవిధంగా కార్యాలయంలోని వ్యయ పరిశీలన ఇతర బృందాలకు సంబంధించి బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ రిటర్నింగ్ అధికారి రాజు, డీఎస్పీ జీవన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బి థర్మల్ ప్లాంట్ మూసివేసేందుకు కుట్ర జరిగింది

- సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- డిసిసి అధ్యక్షులు రాజ్ ఠాకూర్



గోదావరిఖని, అక్టోబర్ 26 (మనం న్యూస్): రామగుండంలోని బి థర్మల్ ప్లాంట్ మూసివేసేందుకు కుట్ర జరిగిందని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆరోపించారు. ఈనెల 22న బి థర్మల్ పవర్ ప్లాంట్‌లో మంటలు చెలరేగి కాలిపోయిన ప్రాంతాన్ని గురువారం ఆయన సందర్శించి, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ బి థర్మల్ ప్లాంట్‌లో మంటలు చెలరేగి కాలిపోయిన విషయం గోప్యంగా ఉంచడం వెనుక అనుమానం ఉందని, సమగ్ర విచారణ జరపాలని అధికారులను డిమాండ్ చేశారు. రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ ప్లాంట్ విస్తరణ చేయించి, రామగుండానికి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు.

## దిష్టిబొమ్మ దహనం చేసిన బిఆర్ఎస్ నాయకులు



తిమ్మాపూర్, అక్టోబర్ 26, (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధు సహాయాన్ని నిలిపివేయాలని కోరుతూ పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో దానికి నిరసనగా గురువారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలోని ప్రధాన రాజీవ్ రహదారి పై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రావుల రమేష్, దేవేందర్ రెడ్డిలు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తెలంగాణ రైతుల పాలిట శాపంగా మారాడని, బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 9 ఏళ్ల నుంచి రైతుల పెట్టుబడి సాయం అందిస్తుంది. ఇది కొత్తగా ఇచ్చేది కాదని, దీనిపై ఈసి కి ఫిర్యాదు చేయడం హేయమైన చర్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి రైతులకు వ్యతిరేకమని, రాబోయే అసెంబ్లీ ఎలక్షన్‌లో రైతులు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు, సర్పంచ్ రావుల రమేష్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వైసీపీ ల్యాగల వీరారెడ్డి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మేనిఫెస్టోను ఇంటింటా ప్రచారం చేస్తాం

- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య



ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 26 (మనం న్యూస్): బిఆర్ఎస్ మేనిఫెస్టోను ఇంటింటికి ప్రచారం చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య అన్నారు. బిఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాన్ని జడ్పిటిసి సభ్యులు చీటి లక్ష్మణరావు, ఎంపిపి పిల్లి రేణుకతో కలిసి గురువారం జెండా ఊపి ఆగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కెటిఆర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. బిఆర్ఎస్ అభివృద్ధి ఫలాలను, సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం జడ్పిటిసి సభ్యులు లక్ష్మణరావు మాట్లాడుతూ కార్యకర్తలు కలిసికట్టుగా ప్రచార బాధ్యతలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షులు బండారి బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు అందె సుభాష్, ఎంపిటిసి సభ్యులు పందిర్ల నాగరాణి పరశురాం గౌడ్, ఎలగందుల అనసూయ నర్సింలు, సింగిల్ విండో డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు సిత్య నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎడ్ల సందీప్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేష్, నంది కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో పోలీసుల కవాతు



బెల్లంపల్లి, అక్టోబర్ 26, (మనం న్యూస్): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బెల్లంపల్లిలో నిర్వహించిన పోలీస్ కవాతును అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్, డిసిపి రామ్ నాథ్ కేకన్ ప్రారంభించారు. ఈ కవాతు తిలక్ స్టేడియం నుంచి ఎఎంసీ గ్రౌండ్ వరకు కొనసాగింది. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజలకు భరోసా ఇవ్వడానికి కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిబి సదయ్య, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సై కుటుంబానికి చెక్కు అందించిన ఎస్పీ సురేష్ కుమార్



కొమురం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 26 (మనం న్యూస్): గత ఫిబ్రవరిలో గుండె పోటుతో మరణించిన ఎఆర్ ఎస్సై ఎం.సురేందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఎస్పీ కె.సురేష్‌కుమార్ చెక్కును అందించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మృతుని సతీమణి ఇందిరకు ఏడు లక్షల 98వేల రూపాయల విలువ చేసే చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సురేందర్ రెడ్డి కుటుంబానికి భద్రత నిధి కింద చెక్కును అందించినట్లు, రావలసిన మరిన్ని బెనిఫిట్స్‌ను త్వరలో అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, డిపిఓ ఏవో శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పోలీస్ సంఘం ప్రెసిడెంట్ విజయ్ శంకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ స్వామి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



తిమ్మాపూర్, అక్టోబర్ 26, (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న రైతు బంధు, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం కరీంనగర్ జిల్లా మానకొండూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ దిష్టి బొమ్మ లను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జివి.రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధాన విధానాలు అవలంభిస్తుందని, రైతు బంధు, రుణమాఫీ వంటి రైతు సంక్షేమ పథకాలను నిలిపివేయాలని జాతీయ ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి తెలంగాణ రైతుల పాలిట శాపంగా మారాడన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు పిట్టల మధుతో పాటు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిదులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం



హుజురాబాద్, అక్టోబర్ 26, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఎలాగైనా అడ్డుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్ కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఆపాలని చూసి కాంగ్రెస్ పెద్ద తప్పు చేసిందన్నారు. సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బాటన పయనిస్తుంటే చూసి ఓర్వలేకే కాంగ్రెస్ పార్టీ కుటిల రాజకీయం చేస్తుందన్నారు. కెసిఆర్ ఎన్నికల సందర్భంగా పెట్టిన మేనిఫెస్టో చూసి కాంగ్రెస్ పార్టీ అయోమయ స్థితిలో పడిందన్నారు. కెసిఆర్ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టో ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతించడంతో మరోసారి కూడా టిఆర్ఎస్ పార్టీ తెలంగాణలో గెలవబోతుందని తలలు పట్టుకుంటున్నారన్నారు. ఎలాగైనా సంక్షేమ పథకాలను ఆపాలని కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని, వీటన్నిటిని ప్రజలు తీక్షనంగా గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజల ఆశీస్సులతో మూడోసారి కూడా తెలంగాణలో టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధిక, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు రవీందర్ రావు, కౌన్సిలర్లు ఉమామహేశ్వర్, కేశిరెడ్డి లావణ్య, మారెపల్లి సుశీల, అపరాద ముత్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ఆశీర్వదించండి

- వేములవాడ బిఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు



వేములవాడ, అక్టోబర్ 26, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు జలాలతో, మల్కపేట రిజర్వాయర్‌తో మెట్ట ప్రాంతమైన కోనరావుపేట మండలానికి తాగు, సాగునీరు అందించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, బావుసాయిపేట, గోవిందరావుపేట తండా, వట్టిమల్ల, గొల్లపల్లి, కమ్మరిపేట తండా, జై సేవాలాల్ బుక్యా రెడ్డి తండా, మరిమడ్ల, అజ్మీరా తండా, కొండాపూర్ గ్రామాల్లో జడ్పీ చైర్ పర్సన్ అరుణ- రాఘవరెడ్డి, మార్క్ ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య యాదవ్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతిలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత రెండు పర్యాయల్లో బి.ఆర్.ఎస్ పార్టీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ మళ్ళీ ఒకసారి కారు గుర్తుకు ఓటేసి, బి.ఆర్.ఎస్ పార్టీకి అధికారం ఇవ్వాలని అలాగే మీ ప్రాంత ముద్దు బిడ్డగా మీ సమస్యలు తెలిసిన వాడిగా ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండలాలలోని ప్రతి గ్రామాలలో సమస్యలపై మంత్రి కేటీఆర్ గారితో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రజలందరికీ బంగారు భవిష్యత్తు కావాలన్నా, మన బతుకులు మారాలన్న మళ్లీ ఒకసారి బిఆర్ఎస్ పార్టీకి అధికారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆయా గ్రామాల్లో పర్యటనకు వెళ్లిన చల్మెడ, జడ్పీ చైర్ పర్సన్ అరుణరాఘవ రెడ్డితో కలిసి శ్రీ రాములపల్లె, మామిడిపల్లి, వట్టిమల్ల గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.



బిఆర్ఎస్‌లో చేరిన యువకులు

కోనరావుపేట మండలంలోని ఆయా గ్రామాల పర్యటనకు వెళ్లిన చల్మెడ సమక్షంలో మామిడిపల్లి గ్రామానికి చెందిన 20మంది యువకులు, బావుసాయిపేటకు చెందిన 20మంది యువకులు, గొల్లపల్లికి చెందిన 20 మంది యువకులు బి.ఆర్.ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి జెడ్పి చైర్పర్సన్ అరుణ, చల్మెడ లక్ష్మి నరసింహారావులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## గంగుల బంధువులు, కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికే కేబుల్ బ్రిడ్జి నిర్మాణం

- నాణ్యతా ప్రమాణాలపై న్యాయ విచారణ జరపాలి
- నాసిరకం బ్రిడ్జిల్లాగానే బిఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోబోతోంది
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 26, (మనం న్యూస్): మంత్రి గంగుల కమలాకర్ బంధువులు, కాంట్రాక్టర్లకు ప్రజా ధనాన్ని దోచిపెట్టడానికే కరీంనగర్ శివారులో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగించినట్లుగా కనిపిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ వ్యాఖ్యానించారు. కేబుల్ బ్రిడ్జిని ప్రారంభించి సంవత్సరం పూర్తికాకముందే పగుళ్లు ఏర్పడడం, కృంగిపోవడం, రోడ్డు చెడిపోవడం, మానేరు రివర్ ఫ్రంట్ లో చెక్ డ్యాములు కొట్టుకపోవడం లాంటివి రాష్ట్ర ప్రభుత్వానికి కనిపంచడం లేదా అని ప్రశ్నించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బ్రిడ్జిలు ఏ విధంగా కూలిపోతాయో రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కెసిఆర్ కూలిపోక తప్పదన్నారు. నాణ్యతా లోపాలతో కూడిన కేబుల్ బ్రిడ్జి పనుల విషయమై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని కేబుల్ బ్రిడ్జిని గురువారం సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, నర్సింహా, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కరీంనగర్‌లో నిర్మించిన కేబుల్ బ్రిడ్జిని చూస్తుంటే పైన పటారంలోన లొటారంలాగా ఉందని విమర్శించారు. పైపై మెరుగులతో నిర్మాణం చేపట్టి అందంగా సుందరీకరణ చేసామని గొప్పలు చెప్పుకోవడం తద్వారా ఎన్నికల్లో లబ్ది పొందాలని మోసపూరితంగా వ్యవహరించారన్నారు. కేబుల్ బ్రిడ్జిని చూస్తుంటే కెసిఆర్, కెటిఆర్ తెల్ల జుట్టుకు నల్ల రంగు వేసుకున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నగరాన్ని స్మార్ట్ సిటీలో భాగంగా సుందరీకరణ పేరుతో మంత్రి గంగుల కమలాకర్ కు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్న పనులు కనబడడం లేదా అని ప్రశ్నించారు. కేబుల్ బ్రిడ్జిని ప్రారంభించిన కేటీఆర్ కరీంనగర్ నగరాన్ని సుందర నగరంగా గంగుల కమలాకర్ తీర్చిదిద్దుతున్నాడని కేబుల్ బ్రిడ్జి ప్రారంభ సందర్భంగా చెప్పాడని, ఇదేనా సుందరమని ప్రశ్నించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికే ఉందని, ఇలాంటి నాసిరకం పనులను చేస్తున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ నాణ్యత ప్రమాణాలపై సమగ్రమైన విచారణ జరిపించి సదరు కాంట్రాక్టర్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, బండ రాజిరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బోయిని తిరుపతి, పైడిపెల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, నలువాల సదానందం, బామండ్లపెల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, మచ్చ రమేష్, కంది రవీందర్ రెడ్డి, బూడిద సదాశివ, సీపీఐ, ఏఐటీయూసీ మహిళా సమాఖ్య, ఏఐఎస్ఎఫ్, ఏ ఐవైఎఫ్ నాయకులు కొట్టే అంజలి, తంగేళ్ల సంపత్, మామిడిపెల్లి హేమంత్, నునవాత్ శ్రీనివాస్, న్యాలపట్ల రాజు, కనకం నరేష్, కాల్వ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యం

- వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్



వేములవాడ, అక్టోబర్ 26, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ గ్రామం హనుమాజీపేటలో గురువారం రోజున కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరోగ్యశ్రీ పథకాన్ని అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.అలాగే నక్క వాగు బ్రిడ్జి నిర్మాణంపై అధికార పార్టీ నాయకులు మోచేతికి బెల్లం పెట్టి అరచేతిలో వైకుంతం చూపిస్తున్నారని మండిపడ్డారు. ఒక్క అవకాశం ఇచ్చి మీ ప్రాంత ముద్దుబిడ్డగా తానను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపించి ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేస్తానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. అంతేకాకుండా నియోజకవర్గంలో నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తానని అన్నారు.



### కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు

కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద సంఖ్యలో చేరికలు జరిగాయి. ఇతర పార్టీ నుండి యువకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గడపగడప తిరుగుతూ సోనియాగాంధీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల మేనిఫెస్టోను ప్రజలకు విన్నపించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వకులభరణం శ్రీనివాస్, బొల్లారం, హనుమాజీపేట ఎంపీటీసీ శ్యామల గోవర్ధన్ రెడ్డి, ఓబీసీ అధ్యక్షుడు వంగపల్లి మల్లేశం, సెల్ అధ్యక్షుడు రొాడి రాజు, తిరుపరెడ్డి, రమేష్, శంకర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిలుక ప్రభాకర్, మల్లేశం, రమణారెడ్డి, అజ్జు భాయ్, విక్కుతి ఎల్లా గౌడ్, లతోపాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన కానిస్టేబుల్ సస్పెన్షన్



కరీంనగర్ క్రైం, అక్టోబర్ 26, (మనం న్యూస్): ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన కానిస్టేబుల్‌పై సిపి సుబ్బారాయుడు సస్పెన్షన్ వేటు వేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గంగాధర పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ మహమ్మద్ ఇలియాజ్ ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా చొప్పదండి నియోజకవర్గం బోయినిపల్లి మండలం నర్సింగపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద స్టాటిక్ సర్వేలెన్స్ టీం లో విధుల్లో నియమింపబడ్డాడు. అధికారుల ఉత్తర్వులు పాటించకుండా, విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా విదులకు గైర్హాజరైన నేపధ్యంలో ఇలియాజ్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు గురువారం సుబ్బారాయుడు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని మరోసారి రుజువైంది

బెల్లంపల్లి, అక్టోబర్ 26 (మనం న్యూస్) : బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ కార్యక్రమాలను రద్దు పరచాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీ అని మరోసారి రుజువైందని మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత వ్యాఖ్యానించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కొరకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన రైతు బంధు, వ్యవసాయానికి ఇస్తున్న 24గంటల ఉచిత విద్యుత్తు పథకాలను నిలిపివేయాలని, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేయడం సిగ్గు చేటన్నారు. సంక్షేమ పథకాలకు అడ్డుపడుతోన్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, టిఆర్ఎస్వి నాయకులు బడికల శ్రావణ్, గెల్లి రాజలింగు, గోశిక రమేష్, నెల్లి రమేష్ పాల్గొన్నారు.




## గంజాయి స్వాధీనం.. యువకుడి అరెస్టు



తిమ్మాపూర్, అక్టోబర్ 26, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని అల్గునూర్ చౌరస్తాలో గురువారం టాస్క్ ఫోర్స్, ఎల్ఎండీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఓ యువకుడి వద్ద గంజాయిని పట్టుకున్నారు. ఎల్ఎండి ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపిన వివరాలప్రకారం అల్గునూర్ చౌరస్తాలో స్కూటీ పై ప్రయాణిస్తున్న వ్యక్తిని టాస్క్ ఫోర్స్, ఎల్ఎండీ పోలీసులు తనిఖీలు చేయగా స్కూటీలో కిలో 265 గ్రాముల గంజా యిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువకుడు అలుగునూర్ కు చెందిన బట్టు అఖిల్(25) గా గుర్తించారు. నిందితుడు గత కొన్ని నెలలుగా అల్గునూర్, ఎల్ఎండీ కాలనీ, తిమ్మాపూర్ తోపాటు చుట్టు పక్కన గ్రామాల్లో స్కూటీపై తిరుగుతూ గంజాయి విక్రయం చేస్తున్నాడు. ఆంధ్రలోని సీలేరు ప్రాంతానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేస్తూ అధిక ధరకు యువతకు విక్రయిస్తున్నాడు. మధ్యాహ్నం పక్కా సమాచారం మేరకు స్కూటీని తనిఖీ చేయగా గంజాయి లభ్యమైనట్లు, గంజాయిని స్వాధీనం చేసుకుని పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి, స్కూటీ, గంజాయితో పాటు నిందితుడిని ని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎల్ఎండి ఎస్సై ప్రమోద్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ ఎస్సై సాంబమూర్తి, ఎల్ఎండీ, టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం



తిమ్మాపూర్, అక్టోబర్ 26, (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతుబంధు, రుణమాఫీ వంటి రైతు సంక్షేమ పథకాలను నిలిపివేయాలని కోరుతూ జాతీయ ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంపై నిరసనగా గురువారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల బిఆర్ఎస్ అధ్యక్షులు, సర్పంచ్ రావుల రమేష్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డిలు హాజరై నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధాన విధానాల అవలం బిస్తుందని, రైతు బంధు, రుణమాఫీ వంటి రైతు సంక్షేమ పథకాలను నిలిపివేయాలని జాతీయ ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేయడం సిగ్గుచేటని, కాంగ్రెస్ పార్టీ, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి తెలంగాణ రైతుల పాలిట శాపంగా మారాడని, బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 9 ఏళ్ల నుంచి రైతుల పెట్టుబడి సాయం అందిస్తుంది. ఇది కొత్తగా ఇచ్చేది కాదని, దీనిపై ఈసి కి ఫిర్యాదు చేయడం హేయమైన చర్య అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు వ్యతి రేకమని, రాబోయే అసెంబ్లీ ఎలక్షన్ లో రైతులు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్య క్షులు, సర్పంచ్ రావుల రమేష్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వైసీపీ ల్యాగల వీరారెడ్డి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఢీ.. అంటే ఢీ..

- ఇద్దరు 'గండ్ర'ల మధ్య బిగ్ ఫైట్
- రసవత్తరంగా భూపాలపల్లి రాజకీయాలు
- ఎత్తుకుపై ఎత్తులు
- పరిస్థితులపై ఎప్పటికప్పుడు అంచనాలు
- గ్రామాల్లో విస్తృత ప్రచారాలు
- చేరికలపై ప్రత్యేక దృష్టి పెట్టిన నేతలు



జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 26, (మనం ప్రతినిధి): భూపాలపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఢీ అంటే ఢీ అంటూ పోటీపడి ప్రచారాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా ఈసారి ఇద్దరు గండ్రల మధ్య బిగ్ ఫైట్ ఎదురుకానుంది. ఇప్పటికే ఎత్తుకు పైఎత్తులు వేస్తూ, ఆయా మండలాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనాలు వేస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రామాల్లో విస్తతంగా ప్రచారాలు నిర్వహిస్తూ చేరికలపై ప్రత్యేక దష్టి పెడుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తాను చేసిన అభివద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూనే, బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోలోని వివిధ పథకాలపై విస్తతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు కార్యకర్తలతో టచ్‌లో ఉంటూ పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. ఆయా గ్రామాలలో పర్యటిస్తూ అభివద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు కూడా గ్రామాల్లో విస్తతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలపై వివరిస్తూ, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మరోవైపు కార్యకర్తలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఆయా గ్రామాలలో కార్యకర్తలు ప్రచారం చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఇద్దరు అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా వివిధ పార్టీల నుండి తమ పార్టీలో నాయకులు కార్యకర్తలు చేరేలా పగడ్బందీ వ్యూహాలను రచిస్తున్నారు. దీంతో అటు నుండి ఇటు, ఇటు నుండి అటు నాయకులు, కార్యకర్తలు చేరుతూ పార్టీ కండువాలు మారుస్తున్నారు. ఏ పార్టీలో ఉంటే తమ భవిష్యత్ బాగుంటుందని అంచనాలు వేస్తూ కింది స్థాయిలోని అసంతప్తి నేతలు పార్టీ మారుతున్నారు. ఇదిలా ఉండగా భూపాలపల్లి నియోజకవర్గంలో ఇద్దరు అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొనే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ఎన్నికల పోలింగ్ నాటికి ఏ పార్టీ బలహీన పడుతుందో, ఏ పార్టీ బలోపేతం అవుతుందో ఏ అభ్యర్థి విజయాన్ని సాధిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య నువ్వా నేనా అనే చందంగా తీవ్ర పోటీ నెలకొనడంతో నియోజకవర్గంలో ఎన్నికలు ఉత్కంఠగా సాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ఓ అభ్యర్థికి మరికొన్ని గ్రామాల్లో మరో అభ్యర్థికి ఇలా సమాన స్థాయిలో మెజారిటీ ఉన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇరువురు ఎమ్మెల్యే అభ్యర్థులు రేసుగుర్రాల్లా ముందుకు పరుగు తీస్తున్నప్పటికీ చివరికి ఆ ఇద్దరిలో విజయం ఎవరిని వరిస్తుందో, భూపాలపల్లి గడ్డమీద ఏ పార్టీ జెండా ఎగురుతుందోననే ఉత్కంఠ పరిస్థితులు స్థానికంగా నెలకొన్నాయి.



## కాంగ్రెస్ గూటికి పరకాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్

- కండువా కప్పి ఆహ్వానించిన గండ్ర సత్యనారాయణరావు



శాయంపేట, అక్టోబర్ 26, (మనం న్యూస్): పరకాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. శాయంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డికి కండువా కప్పి భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు ఆహ్వానించారు. శ్రీనివాస్ రెడ్డి వెంట సాధనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ లావుడ్య వెంకటేశ్‌తోపాటు పలు గ్రామాలకు చెందిన మరో 200మంది బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివద్ధి శూన్యమని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ మోసకారి పార్టీ అని భావించి, గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన గండ్ర వెంకటరమణ రెడ్డిని గెలిపిస్తే, బీఆర్ఎస్ పార్టీకి వెళ్లాడని ఆరోపించారు. గండ్ర వెంకటరమణారెడ్డి భూపాలపల్లి ఎమ్మెల్యేగా ఉండి శాయంపేట మండలంలోని గ్రామాలకు చేసిన అభివద్ధి ఏమీ లేదని విమర్శించారు. ఎమ్మెల్యే తన ఆయిల్ ఫామ్ నుండి మొక్కలను భూపాలపల్లి నియోజకవర్గ రైతులకు అధిక ధరలకు ఇస్తూ, రైతులను నిండా ముంచుతున్నారని శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. భూపాలపల్లిలో గండ్ర సత్తన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని, అందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్సార్ వెంట శాయంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చల్ల చక్రపాణిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న తోటి మిత్రునికి ఆర్థిక సహాయం



చెన్నారావుపేట, అక్టోబర్ 26, (మనం న్యూస్): చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన ఎడ్ల రమేష్ బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతూ పదిహేను రోజుల క్రితం వరంగల్‌లోని హాస్పటల్‌లో సర్జరీ చేయించుకుని ఇంటికి చేరుకోవడంతో ఆ విషయాన్ని తెలుసుకున్న అతని పాఠశాల మిత్రులు రమేష్ ను పరామర్శించి తమ వంతు సహాయంగా రూపాయలు 26500 వారి కుటుంబానికి అందించి, మనో ధైర్యాన్ని కల్పించారు. పరామర్శించిన వారిలో మిత్రులు చింతకాయల లక్ష్మీనారాయణ, మండల మల్లయ్య, నాంపల్లి శ్రీనివాస్, లక్క స్వామి, ఒంటరి రాములు, మజ్జిగ కుమారస్వామి, మొగులాజి ఈశ్వర్, దూపటి రమేష్, జన్ను ప్రభాకర్, కట్టయ్య తదితరులు వున్నారు.

## పొన్నాల లక్ష్మయ్యని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



జనగామ, అక్టోబర్ 26, (మనం న్యూస్): జనగామ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యనిమర్యాదపూర్వకంగాకలిసిసమావేశమైనారు.

## మేడిగడ్డ బ్యారేజీ దుర్ఘటనపై విచారణ చేపట్టాలి

- మేడిగడ్డ బ్యారేజి వంతెన కుంగుబాటు సంఘటనపై తక్షణమే కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- బిఎస్పి కాటారం మండల అధ్యక్షులు బొడ్డు రాజబాబు డిమాండ్

కాటారం, అక్టోబర్ 26, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్షల కోట్లు వెచ్చించి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం చేసిన మేడిగడ్డ ప్రాజెక్టు మేడిపండు చందంగా మారిందని ఆయన అన్నారు.మేడిగడ్డ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే పెద్ద ప్రాజెక్ట్ అని ప్రజలకు మాయ మాటలు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, లక్షలాది ఎకరాలకు సాగు నీరు మరియు ప్రజలకు తాగునీరందించి తెలంగాణను సస్య శ్యామలము చేస్తుందని గొప్పలు చెప్పిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర మంత్రులు రామారావు, హరీష్ రావులు కాంట్రాక్టుదారుల నుండి కోట్లాది రూపాయల కమిషన్స్ దండుకోని సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో, ఇదే అదునుగా కాంట్రాక్టుదారులు ప్రాజెక్ట్ నిర్మాణంలో నాసిరకం నిర్మాణా సామాగ్రి వాడి లోపభూయిష్టమైన డిజైనింగ్‌లో ప్రాజెక్టు నాణ్యతకు తిలోదకా లివ్వడంతో, గతంలో వర్షాలకు బాహుబలి మోటార్స్ నీట మునిగి లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని, అదేవిధంగా పలిమేల మండలం ముంపుకుగురి కావడం జరిగింది, మేడిగడ్డ బ్యారేజిలోకి ఎక్కువ నీరు రావడంతో ముందస్తు హెచ్చరికలతో దశాలవారీగా గేట్లు ఎత్తవలసి ఉండగా ఒక్కసారి మొ త్తం గేట్లు ఎత్తడంతో రెండు వందల అరువై ఒక్క గొర్రెలు కొట్టుకుపోవడము జరిగింది, బ్యాక్ వాటర్ ద్వారా రైతులు పండించే పంటలకు నష్టం వాటిల్లు తుంది, నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం అందిచాలని లేని పక్షములో బిఎస్పి ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని తెలియజేసారు మూడు రోజుల క్రితం 18 వ నంబర్ పిల్లర్ నుండి ఇరవైవ నంబర్ పిల్లర్ వరకు వంతెన కంగి పోవడంతో వంతెన భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని బిఎస్పి మండల అధ్యక్షులు బొడ్డు రాజబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మెడిగడ్డ బ్యారేజి వంతెన కుంగుబాటుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పాటు కాంట్రక్ట్ దారులు నైతిక బాధ్యత వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ కాటారం మండల శాఖ తరుపున బొడ్డు రాజబాబు డిమాండ్ చేశారు.



## బిఆర్ఎస్, బిజెపి పార్టీలను ప్రజలు తరిమికొట్టాలి

- మావోయిస్టు పార్టీ వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి సుధాకర్ పేరిట లేఖ

వెంకటాపురం నుగూరు, అక్టోబర్ 26, (మనం న్యూస్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి, వారిని తరిమికొట్టాలని మావోయిస్టు పార్టీ వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి సుధాకర్ పేరిట గురువారం సోషల్ మీడియాలో లేఖ విడుదలైంది. ఈ లేఖలో ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై సమావేశ నాయకులు ఘాటుగా విమర్శించారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ టిఆర్ఎస్ పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్ననాళ్ళు ప్రజల మౌలిక అవసరాలను గాలికి వదిలేసిందని విమర్శించారు. అధికారం సాధించడమే ప్రధాన లక్ష్యంగా ప్రజల రాజకీయ వెనుకబడుతనాన్ని ఆసరాగా చేసుకుని టిఆర్ఎస్ బిజెపి పార్టీలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, కులం, మతం వంటి వాటిని ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి ప్రజల మౌలిక అవసరాలు ఏమాత్రం తీర్చకుండానే మూడోసారి మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు చేస్తుందన్నారు. గత పది సంవత్సరాలుగా ఆదివాసులు సాగుచేసుకుంటున్న భూములను సామ్రాజ్యవాదులతో తొత్తులుగా మారిన ప్రభుత్వం హరితహారం, అభయారణ్యం పేరుతో భూములను అటవీ అధికారులతో దాడులు చేయించి లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కొన్ని కొన్నిచోట్ల పోడు భూములకు పట్టాల పేరుతో నామమాత్రంగా భూములను పంచుతూ ఆదివాసీలను ఏం మారుస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న కోడి భూములన్నిటికీ పట్టాలి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తమది రైతు ప్రభుత్వం అని చెప్పుకునే బిఆర్ఎస్ పార్టీ రైతుబంధు పథకం పెట్టి ధరణి పోర్టల్ పేరుతో ఉన్న భూములన్నీ భూస్వాములకే పట్టాలు చేసి, వారికే లబ్ధి చేకూర్చాయని అన్నారు. రైతుల పండించిన వరి పంటను తాలు, తడిచింది అనే పేరుతో ఇంతకు 25 కేజీలకు పైగా తరుగు తీస్తూ రైతులను తీవ్రంగా నష్టాలపాలు చేసిందని విమర్శించారు. ఈ కారణంగానే అనేకమంది రైతులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. వెంకటాపురం వాజేడు మండలాల్లోని కలిపాక, తిప్పాపురం, కొత్తగుంపు, ముత్తారం, పెంకెవాగు, కర్రె వానిగుప్ప, వంటిమామిడి, బొల్లారం, దూల పురం పెనుగోలు వంటి గ్రామాల్లో చెరువులను నీరు రాకుండా చేసి, కుంటల్లోకి నీరు చేరకుండా చేసి కరువు ఏర్పడే విధంగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, క్రమేపి వారిని వ్యవసాయానికి దూరం చేసే పరిస్థితులు కల్పిస్తోందని ఆరోపించారు. అటువైపు ప్రాంతాల్లోని ఆదివాసీలను పోలీసులు ఇన్ ఫార్మర్ల నిపంతో చిత్రహింసల గురిచేసి అక్రమ కేసులు బనాయించి రోజుల తరబడి స్టేషన్ల చుట్టూ తిప్పుకుంటున్నారని, అక్రమంగా జైల్లో బంధిస్తున్నారని, మరికొందరిని మావోయిస్టులకు ఇకపై సహకరించమంటూ తాసిల్దారుల సమక్షంలో బైండోవర్ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఆసరా, రైతుబంధు, దళిత బంధు ఇస్తామని చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. ఈ పథకాలు కేవలం ప్రభుత్వ అనుకూల వర్గాలకు, దోపిడి దారులకు లబ్ధి చేకూరుతున్నాయి తప్ప పేద ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని విమర్శించారు. అన్యాయాలను ఎదిరించే వారిపై ఉప కేసులు పెడుతూ జైళ్ళ పాలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో రానున్న ఎన్నికల్లో ప్రధానంగా టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య పోటీ ఉండగా అధికారం కోసం బిజెపిని ప్రధాన పోటీగా దింపి ఈ ఎన్నికల్లో టిఆర్ఎస్ లాభపడాలని చూస్తోందని విమర్శించారు. టిఆర్ఎస్, బిజెపిల మధ్య లోపాయకారి ఒప్పందం జరిగిందని ఆరోపించారు. జల్, జంగిల్, జమీన్ నినాదంతో ప్రజలంతా విప్లవాత్మక పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల్లో టిఆర్ఎస్ బిజెపి కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నిలదీయాలనీ పిలుపునిచ్చారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరిగింది

- కాంగ్రెస్ గాలి వీస్తుంది
- ప్రజా దీవన యాత్రలో నాయిని రాజేందర్ రెడ్డి..



కాజీపేట, అక్టోబర్ 26, (మనం న్యూస్): బిఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరుగుతుందని, ఈ సునామిలో ప్రభుత్వం కొట్టుకుపోతుందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట చౌరస్తా శివాలయం నుండి గురువారం ప్రజాదీవన యాత్ర ప్రారంభమై కష్ణానగర్ కాలనీ, హనుమాన్ గుడి, జూబ్లీ మార్కెట్ మసీద్, వడ్డెరి బస్తీ, సత్తయ్య సెట్ బిల్డింగ్ రోడ్డు, వేలంగని స్కూల్, సెయింట్ ఆన్స్ స్కూల్ బ్యాక్ సైడ్, విద్యానగర్, వాటర్ ట్యాంక్ బ్యాక్ సైడ్ మీదుగా సాగి విష్ణుపురి మూడు సింహాల విగ్రహం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంఎల్ఎ వినయ్ భాస్కర్ కాంగ్రెస్ పార్టీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేక ప్రజల్లో తాము ఎక్కడ చులకన అవుతామనే ఉద్దేశంతో నాపై కుట్రలు కుతంత్రాలు చేస్తున్నాడనారు. నాపై ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నిన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు, కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేల నన్ను ధైర్యంగా ఎదుర్కొనలేక నా క్యారెక్టర్ అషాషినేషన్ చేయడానికి బిఆర్ఎస్ నాయకులు కుళ్ళు కుతంత్రాలు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తుందని, ఈ గాలిలో బిఆర్ఎస్ పార్టీ కొట్టుక పోతుందనీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నెలలోపే సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తాం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ అంకుష్, ఆరూరి సాంబయ్య, మహిళా నాయకురాలు నాగపురి లలిత గౌడ్, డివిజన్ అధ్యక్షుడు పోగుల సంతోష్, ఇప్ప శ్రీకాంత్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు కూర వెంకట్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, ఎస్సి డిపార్టుమెంటు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి. రామకష్ణ, గుంటి స్వప్న, ఫ్రాన్సిస్ రెడ్డి, ఇన్నా రెడ్డి, సమ్మయ్య, ఎంవి రాజు, మానస, మాడు క్రాంతి, భరత్, నవీన్, సలీం, సందీప్, రాకేశ్, శంకర్, నసీం బాబా పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు



వర్ధన్నపేట, 26 అక్టోబర్, (మనం న్యూస్): అధికార పార్టీ బిఆర్ఎస్ పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. వర్ధన్నపేట పట్టణానికి చెందిన మాజీ వార్డ్ సభ్యులు బిఆర్ఎస్ నాయకులు సిలివేరు శ్రీధర్ ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం వర్ధన్నపేట పట్టణంలో విశ్రాంత ఐపిఎస్ అధికారి, కాంగ్రెస్ నాయకులు కేఆర్ నాగరాజు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను తెలియపరుస్తూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఫిరంగి గడ్డలో మాజీ వార్డ్ సభ్యులు బిఆర్ఎస్ నాయకులు సిలివేరు శ్రీధర్ ఆధ్వర్యంలో వడ్డెర కాలనీకి చెందిన పలువురు నాగరాజు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నాగరాజు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కిసాన్, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు, పూర్వ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, పూర్వ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, నాయకులు పోశాల వెంకన్న, మహ్మద్ అక్బర్, గుంటి కుమారస్వామి, చిదురాల కుమారస్వామి, మహ్మద్ అఫ్సర్, మైస సురేష్ పాల్గొన్నారు.

## మతుని కుటుంబానికి రూ.85 వేలు ఆర్థిక సాయం



జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 26, (మనం ప్రతినిధి): మతుని కుటుంబానికి రూ.85 వేలు ఆర్థికసాయం అందించి చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఆకుల రాంబాబు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇటీవలె మతి చెందాడు. కాగా ఈ విషయం తెలుసుకున్న అతనితో చదువుకున్న 2003-2004 బ్యాచ్ పదవ తరగతి మిత్రులు గొప్ప హదయంతోచేయి చేయి కలిపారు. ఆపదలో ఉన్న మిత్రుని కుటుంబాన్ని ఆదుకోవాలని ఎవరికి తోచినంత వారు ఆర్థిక సహకారం అందించారు. మొత్తం రూ.85 వేలు వసూలు కాగా గురువారం మతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. రూ.85 వేలు ఆర్థిక సాయం అందించి, అన్నివిధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు నాగపురి వెంకటేష్ గౌడ్, పెరుమాండ్ల రాజు, తౌటం నవీన్, మామిడాల శ్రీనివాస్, దాసారపు నరేష్, తూటిచర్ల రాజేందర్, కిరణ్, గోపగాని మహేష్, అనుప మహేష్, మొలుగూరి కుమార్, పల్లవేన కుమార్, జంగపెల్లి శ్రీధర్, సాదవిజయ్, రుద్రవీణ కుమార్, కొర్రి సాంబశివుడు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సతీష్ కుమార్ ప్రచారం

- ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మకండి గోసపడకండి
- ప్రచారంలో పాల్గొన్న హుస్నాబాద్ బీఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జ్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి
- సతీష్ కుమార్‌కు అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు



భీమదేవరపల్లి, అక్టోబర్ 26, (మనం న్యూస్): భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సతీష్ కుమార్, హుస్నాబాద్, హుజురాబాద్ బీఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జ్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి,హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, బీఆర్ఎస్ యువ నేత వొడితల ఇంద్రనీల్ తదితరులు కొత్తకొండ, చంటయ్యపల్లి, ధర్మారం, రసూల్ పల్లె, మల్లారం, వీర్లగడ్డ తండాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

### బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్ గ్రామ యువకులు ......

హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సతీష్ కుమార్, హుస్నాబాద్, హుజరాబాద్ బీఆర్ఎస్ ఎన్నికల ఇంచార్జ్ మాజీమంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో ఎలకతుర్తి మండలం వీరనారాయణపుర్ గ్రామంలోని 30 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు వారికి హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్, మాజీమంత్రి పెద్దిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి
- ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా దాసరి సంఘం ఏకగ్రీవ తీర్మానం



మిరుదొడ్డి, అక్టోబర్ 26, (మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని దుబ్బాక నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్ గ్రామంలో పర్యటించారు. ఖాజీపూర్ గ్రామ దాసరి సంఘం సభ్యులు ఈసారి వేసే ప్రతి ఓటు కొత్త ప్రభాకర్‌రెడ్డికే వేస్తామని ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాసరి సంఘం సభ్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో జరగని అభివృద్ధి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సారథ్యంలో దుబ్బాక నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి జరిగిందన్నారు. ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి సారథ్యంలో అక్బర్‌పేట భూంపల్లి మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు మేము కారు గుర్తుకు ఓటేస్తామని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు చెప్పే మాటలు అవాస్తవమన్నారు. ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి పని చేసే పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని, కాబట్టి తాము బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థికే ఓటు వేస్తామని తీర్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజీపూర్ గ్రామ తెరాస కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సుంచనకోటలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు



చేర్యాల, అక్టోబర్ 26, (మనం న్యూస్) : చేర్యాల మండలంలోని సుంచనకోట గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌బిఐ లీడ్ డిస్ట్రిక్ ఆఫీసర్ తాన్య సంఘమా పాల్గొని మాట్లాడారు. రద్దు చేసిన రూ.2 వేల నోట్లు ఇంకా ఎవరి దగ్గరైనా ఉంటే వాటిని హైదరాబాద్ ఆర్‌బిఐ కార్యాలయంలో మార్చుకోవాలని సూచించారు. అదేవిధంగా సిద్దిపేట జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్ మాట్లాడుతూ తీసుకున్న లోన్ సరైన సమయంలో కట్టడం ద్వారా భవిష్యత్తులో ఎక్కువ లోన్ పొందే అవకాశం ఉంటుందన్నారు. పిల్లలకు ఏటియం కార్డు ఇచ్చి వాటి సమాచారం ప్రైవేటు యాప్‌లో దాచి ఉంచడం ద్వారా నష్టపోయే ప్రమాదం ఉందని, ఎవరికైనా పై చదువుల కోసం ఆర్థిక అవసరాలకు లోన్ కావాలంటే ఆర్‌బిఐ అనుమతి పొందిన బ్యాంకు నుండి తప్ప ఇతర లోన్ యాప్‌ల నుండి తీసుకొని నష్టపోవద్దని సూచించారు. చేర్యాల డబ్ల్యూ డిసిసి బ్యాంకు మేనేజర్ నందిని మాట్లాడుతూ బ్యాంకు కేవలం లోన్ కోసమే కాకుండా అన్ని రకాల సేవలు అందించేందుకు ఉందని, ప్రతి ఒక్కరు ఏదో ఒక ఆరోగ్య లేక జీవిత భీమా పాలసీ కలిగి ఉండాలని, దీని ద్వారా కుటుంబం రోడ్డుపాలు కాకుండా ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూడిసిసి బ్యాంకు నోడల్ మేనేజర్, బ్యాంకు సిబ్బంది దయాకర్, చేర్యాల కోఆర్డినేటర్‌పోతుగంటికరుణాకర్,సాయికుమార్‌గ్రామస్తులుపాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి... ఆరుగురి అరెస్ట్


- నగదు, మోటార్ సైకిళ్లు, కార్లు, ఫోన్‌లు స్వాధీనం



కొండపాక, అక్టోబర్ 26, (మనం న్యూస్) : కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొడకండ్ల గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్ఐ పుష్పరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ఆకస్మిక దాడి చేశారు. కొడకండ్ల గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ. 54, 835లను, రెండు మోటార్ సైకిళ్లు, రెండు కార్లు, ఆరు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. పేకాట ఆడుతున్న వారంతా కొడకండ్ల, గజ్వేల్ ప్రాంతాలకు చెందిన వారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో ఫామ్‌హౌజ్‌లలో, ఇళ్లలో లేదా బహిరంగ ప్రదేశాల్లో పేకాట, జూదం, మరే ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఎవరైనా నిర్వహించినట్లు తెలిస్తే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 67100 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. పేకాట, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇది ధర్మ యుద్ధం

- మల్లన్న సాగర్ బాధితులు రోజు కూలీలుగా మారారు
- ఇబ్బందులు తప్పవు.... కుట్రలు చేస్తారు
- రేషమున్నోడే న్యాయం వైపు ఉంటాడు
- ఏమిచ్చినా తీసుకోండి...కమలానికి ఓటెయ్యండి
- గజ్వేల్ బీజేపి అభ్యర్థి ఈటల రాజేందర్



గజ్వేల్/జగదేవ్‌పూర్, అక్టోబర్ 26 (మనం న్యూస్): డబ్బుల కట్టలు దిగుతాయి.. మద్యం ఏరులై పారుతుంది.. నేను వాటినివ్వలేను.. జరిగేది మాత్రం ధర్మయుద్ధమేనని గజ్వేల్ బీజేపి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. అపనిందలు మోపి పార్టీ నుండి గెంటేసినా ఆత్మగౌరవం కలిగిన హుజురాబాద్ బిడ్డను డబ్బుల వైపు నిలబడకుండా ఆత్మగౌరవం వైపు నిలబడ్డానని, రేపు ఇక్కడా అదే జరగబోతుందన్నారు. మొట్టమొదటి సారిగా గజ్వేల్‌కు వస్తున్నానంటేనే ఎక్కడికక్కడ దావత్‌లు పెట్టిర్రు.. పైసలు పంచిర్రు.. రేపటి నుంచి కాషాయం కండువా ఉన్న వారిముందే పక్కోళ్లకు వేలకు వేలు పంచుతారు.. కండువున్నోళ్లను ఇబ్బంది పెడుతారు.. అన్నింటికీ ఓపిక పడితేనే, గట్టిగా నిలబడితేనే ధర్మం గెలుస్తుందన్నారు. హుజురాబాద్ ఎన్నికల్లోనే చెప్పా.. శిఖండితో యుద్ధం చేయ.. వీరుడితో యుద్ధం చేస్తానని.. అన్నమాట ప్రకారమే గజ్వేల్‌కు వచ్చా.. దీవించాల్సిన బాధ్యత మీదే.. అన్నారు. గజ్వేల్ నియోజకవర్గ బీజేపి అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం తొలిసారిగా గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నుండి మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కాంగ్రెస్ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు మాందాడి జశ్వంత్‌రెడ్డిల తోపాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ గ్రామాల్లో గుడుంబా బంద్ అయింది. కేసీఆర్ లిక్కర్ మాత్రం ఏరులై పారుతోంది. అర్ధరాత్రి కడుపునొస్తే టాబ్‌లెట్ దొరకదేమో కానీ, కుతి కొట్టుకుంటే చాలు కోటర్లకు కోటర్లు లిక్కర్ దొరుకుతుందన్నారు. నీళ్లు తేవాలి.. పంటలు పండించాలి.. అది ప్రభుత్వ బాధ్యత. దాన్నేమీ కాదనను.. కానీ ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములిచ్చిన వారిని అక్కున చేర్చుకోవాల్సిన బాధ్యత లేదా అని అడుగుతున్నాం. మల్లన్న సాగర్‌లో ఇళ్లు కోల్పోయి, భూములు కోల్పోయి వచ్చిన వారంతా ఎలా ఉన్నారని ఒక్కసారి ఆలోచించావా..? కేసీఆర్ ..? అంటూ తమదైన శైలిలో విమర్శలు చేశారు. ప్రాజెక్టులకు భూములిచ్చిన రైతులు రోజు కూలీలుగా మారుతారా..! సిగ్గు సిగ్గు..!! అన్నారు. రేషమున్నోడు ముమ్మాటికి న్యాయం వైపే నిలబడుతాడు. తెలంగాణ ఉద్యమం మొదలైన నాటి నుండి ఇప్పటి వరకు ప్రతి సందర్భంలో న్యాయం వైపే నిలబడ్డా. 20 ఏళ్లు పని చేయించుకొని బదనాం చేస్తే అవమానాన్ని భరించలేక బయటకు వచ్చా. పార్టీ బి ఫామ్ కేసీఆర్ ఇవ్వచ్చుగాక.. ప్రజల ఆశీర్వాదమే తనను ప్రతి సారి దీవించిందన్నారు. బి ఫామ్ ఇస్తేనే గెలిస్తే మరి ప్రతి ఒక్కరు ఎందుకు గెలవడం లేదన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె అయినా, ఆర్టీసి ఉద్యోగుల సమ్మె అయినా వారి వెంట నిలబడ్డా. ఒకనాడు ఆర్టీసి కార్మికులు సమ్మె చేస్తున్న ఉద్యోగ నాయకులు కాపాడమని వేడుకున్నా కనికరించలే.. నేడు ప్రభుత్వ ఉద్యోగుల్లా మార్చామంటూ చెబుతున్నావంటే నాడు అణగదొక్కి నేడు అందలమెక్కించావంటే ఓట్ల రాజకీయం కాక ఇంకేంటన్నారు. గజ్వేల్ నాకు కొత్త కాదు, 1992లో వర్గల్ నుండే నా వ్యాపారాన్ని మొదలు పెట్టా.. ఇక్కడున్న ప్రతి ఒక్కరు నాకు ఆత్మీయులే. అందరితో అనుబంధముందన్నారు. తెలంగాణకు ఒక్క పైసా ఇవ్వను.. అని అహంకారంతో మాట్లాడిన మాటలకు ప్రజాప్రతినిధిగా అసెంబ్లీలో గంటపాటు ఆత్మగౌరవాన్ని ఆవిష్కరించేలా మాట్లాడిన ఆ మాటలే తనకు మధుర క్షణాలు, తీపి జ్ఞాపకాలు అన్నారు. హుజురాబాద్‌లోనే చెప్పా.. దళితబంధు అందరికీ అందదని.. అది ఎన్నికల డ్రామా అని. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో గజకర్ణ గోకర్ణ విద్యలను ప్రదర్శించి 600 కోట్లు కుమ్మరించినా ప్రజలు ధర్మం వైపే నిలబడ్డారన్నారు. ఈటల రాజేందర్ గజ్వేల్‌కు వస్తుండంటేనే ఇక్కడి ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులకు గౌరవం పెరిగిందన్న విషయం మర్చిపోవద్దన్నారు. రెండుసార్లు గుండెల్లో పెట్టుకొని ఆశీర్వదించి దీవిస్తే కనీసం బుక్కెడు బువ్వ పెట్టి వారిపట్ల మర్యాద కనబర్చలేదన్నారు. కారుకు పంక్చర్ తప్పదని భావించి ఆగమాగమవుతూ కుటిల రాజకీయాలకు తెరలేపుతారు. డబ్బులైతే లేవు.. ధర్మం కోసం కొట్లాడే బిడ్డను.. మచ్చలేని మనిషిని.. ఆశీర్వదించండన్నారు. బీజేపి అధికారంలోకి వస్తే కౌలు రైతులను ఆదుకునే జిమ్మెదారి మాది. పేద రైతులకు మాత్రమే రైతుబంధు ఇస్తాం. గింజ తరుగు లేకుండా ధాన్యాన్నంతా కొంటాం.. నిరుద్యోగులకు నౌకర్లిస్తాం.. నిండు మనసుతో దీవించండి. కేసీఆర్ పీడ విరుగుడు కావాలంటే ఓటుతోనే సమాధానం చెప్పాలన్నారు. దుబ్బాక శాసన సభ్యులు రఘునందన్‌రావు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ అనే చెరువు తెగింది. ఇక అడ్డుకట్ట వేయలేరు. మామొచ్చినా, అల్లుడాపినా ఇక ఆగేది లేదు. పదేండ్లు కనీసం కనిపించని, పట్టించుకోని కేసీఆరే కలవలేకపోయినా.. క్షమించండి.. అన్నారంటేనే గజ్వేల్‌లో ఓటమి ఖాయమని భావించారని దుబ్బాక శాసనసభ్యులు రఘునందన్‌రావు అన్నారు. ఇన్ని రోజులు పాలించావో, దోచుకున్నావో, దాచుకున్నావో ఇక చాలు దొర .. అంటూ సెలవు చెప్పేందుకు గజ్వేల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 55 శాతం పైగా ఉన్న బిసిలను ఎంత మాత్రం పట్టించుకోని బిఆర్ఎస్ సర్కార్ కులవృత్తుల ద్వారా బతకండంటూ గొప్ప సలహా ఇచ్చి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసారన్నారు. బిసిలకు ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో మంత్రి పదవులు అనుభవిస్తున్న తలసాని శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్‌లే చెప్పాలన్నారు. అవసరమున్నప్పుడే ఆత్మీయత, అవసరం తీరాక కన్నెత్తి కూడా చూడకపోవడం హరీష్‌రావు నైజమన్నారు. సిద్దిపేటకు, గజ్వేల్‌కు, దుబ్బాకకు అన్నీ నేనే అంటూ పోజులు కొడితే దుబ్బాకలో గట్టిగా బుద్ధి చెప్పారని, ఆరడుగుల బుల్లెట్ అంటూ చెప్పుకుంటున్న ఆ బుల్లెట్ మందు లేదని, ఒట్టి బుర్ర మాత్రమే మిగిలిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి దళితుడే అంటూ మోసం చేసిన కేసీఆర్ కనీసం ఆ సామాజిక వర్గానికి ఒక్క మంత్రి పదవి ఇవ్వని కేసీఆర్‌కు చావు డప్పు కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులతో బెదిరిస్తాం.. అంటే కుదరదని, ఆకలినైనా భరిస్తాం తప్పితే ఆత్మాభిమానాన్ని మాత్రం అమ్ముకోమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు దారం గురువారెడ్డి, చొప్పదండి విద్యాసాగర్, బైరి శంకర్ ముదిరాజ్, ఉడుత మల్లేశం యాదవ్, కొత్తపల్లి వేణుగోపాల్, నలగామ శ్రీనివాస్, నందన్ గౌడ్, కుమ్మరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఘన స్వాగతం

బీజేపి గజ్వేల్ నియోజకవర్గ అభ్యర్థిగా తొలిసారి గజ్వేల్‌కు వచ్చిన ఈటల రాజేందర్‌కు పార్టీ నాయకులు, శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. వంటిమామిడి నుండి భారీ సంఖ్యలో కార్యకర్తలు స్వాగతం పలుకగా వర్గల్ సరస్వతి క్షేత్రంలో పూజలు చేసిన అనంతరం గజ్వేల్‌లోని కోట మైసమ్మను దర్శించుకున్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. కరెంటు కాటగల్సుడే

- గ్యారంటీ కార్డు కాదు..అది ఓ బోగస్ కార్డు
- టికెట్ నాదంటే నాది అంటూ కొట్లాట
- హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



హుస్నాబాద్, అక్టోబర్ 26, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ నిన్నగాక మొన్న కర్ణాటకలో గెలిచింది. ఆడ ఏం డైలాగులు కొట్టిండ్రు. 20 గంటల కరెంటు ఇస్తమన్నరు. ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య...5 గంటల కరెంటిస్తం, అండ్లనే సగవెట్టుకోండ్రి అన్నడు. ఇక్కడ కూడా కాంగ్రెస్ అధ్యక్షుడు కడుపుల మాట కక్కిండు.రైతులకు ఎందుకు 24 గంటల కరెంటు..వేస్ట్...3 గంటలు సరిపోతదని మాట్లాడుతున్నడు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు కాటగలుస్తదని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు గురువారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ హుస్నాబాద్‌లో రూ.345 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గల్లీ గల్లీకి సిసి రోడ్లు, మున్సిపల్ కార్యాలయం, ఐఓసి బిల్డింగ్, ఎల్లమ్మ చెరువు సుందరీకరణలాంటి ఎన్నో అభివృద్ధి పథకాలను తాజామాజీ శాసనసభ్యుడు వొడితల సతీశ్‌కుమార్ చేసారని ఆమె గుర్తు చేసారు. కాంగ్రెస్ చెప్పే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మరని ఆమె పేర్కొన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను గడప గడపకు ప్రచారం చేస్తామని ఆమె తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చెప్పేదొకటి..చేసేదొకటి అంటూ ఆమె మండిపడ్డారు. కర్ణాటకలో విద్యుత్ సంక్షోభం ఏర్పడుతుందని తెలంగాణలో మాత్రం రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆమె కొనియాడారు. కాంగ్రెస్ పాలిస్తున్న రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆమె దుయ్యబట్టారు. కర్ణాటకలో అమలు చేయలేదు కానీ తెలంగాణలో అమలు చేస్తారా అంటూ ఆమె ప్రశ్నించింది. హుస్నాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో ఒకరేమో టికెట్ నాదేనని కొత్తకొండ దేవాలయంలో ప్రచార రథాలకు పూజలు చేస్తుంటే మరో నేత కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయిందంటూ బస్సుల్లో కాంగ్రెస్ నేతలను తీసుకుపోతుంటే నవ్వు వస్తోందన్నారు. పిల్లర్లు కుంగితే దానిని పెద్ద హంగామా చేస్తున్నారని ఆమె తెలిపారు. కాంగ్రెస్‌వి గ్యారంటీ లేని హామీలు అన్నారు. కర్ణాటకలో రైతులకు కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. తెలంగాణ ప్రాంతంలో కర్ణాటక రైతులు కాంగ్రెస్‌కు ఓటేయద్దు అంటూ ప్ల-కార్డులతో తిరుగుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఏడబోయిన రజిని, నేషనల్ లేబర్ కోపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్ దండుగుల రాజ్యలక్ష్మి, కౌన్సిలర్‌లు గోవిందు రవి, భాగ్యరెడ్డి, హరీశ్, కొంకటి నళినిదేవి,మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడబోయిన తిరుపతిరెడ్డి, నాయకులు ఆయూబ్‌పాషా, తదితరులున్నారు.

## అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలి

- మూడేళ్లలో రఘునందన్‌రావు చేసింది శూన్యం
- బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



తొగుట, అక్టోబర్ 26, (మనం న్యూస్): ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పే వారిని పక్కన పెట్టి అభివృద్ధి, సంక్షేమం చేసే బిఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టాలని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పిలుపునిచ్చారు. తొగుట మండలంలోని పెద్దమాసాన్‌పల్లిలో గ్రామ పార్టీ అధ్యక్షులు బోయిని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ఎన్నికల్లో గెలిచి మూడేళ్లయినా రఘునందన్‌రావు చేసిందేమీ లేదన్నారు. 55 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ సర్కారు తెలంగాణకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తెలంగాణ సాధించిన తొమ్మిదేళ్లలోనే అభివృద్ధి, సంక్షేమం దిశగా దేశంలోనే ఆదర్శంగా నిలిచామన్నారు. రాబోయే ఎన్నికల్లో సౌమ్యుడు, అభివృద్ధి సాధకుడు ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఘన విజయం అందించాలని కోరారు. అంతకుముందు కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యేగా ఘన విజయం అందించేలా ఆశీర్వదించాలని ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభాకర్ వర్మ, ఏఎంసి చైర్మన్, వైస్ చైర్మన్‌లు దోమల కొమురయ్య, కంది రాంరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సిరినేని గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్, ఎంపిటిసిలు మెట్టు వరలక్ష్మి, స్వామి, మాష్టి సుమలత కనకయ్య, ఉప సర్పంచ్ అల్వాల రాజిరెడ్డి, సొసైటి డైరెక్టర్ పి. నారాయణరెడ్డి, యూత్, సోషల్ మీడియా బాధ్యులు బెల్లె మహేందర్, పన్యాల స్వామిరెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు



కొండపాక, అక్టోబర్ 26, (మనం న్యూస్): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజలను మభ్యపెట్టేందుకు ఎలాంటి సరుకులను తరలించడాన్ని నిషేధిస్తూ ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పోలీసులు వాహనాల తనిఖీలు ప్రారంభించారు. ఈ మేరకు కొండపాక మండలం వెలికట్ట రోడ్డు వద్ద జనగామ రోడ్డుపై గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో సెంట్రల్ ఫోర్స్, బిఎస్ఎఫ్ వారు సంయుక్తంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

# స్వేచ్ఛగా ఓటేయండి

- మీకు భరోసాగా మేమున్నాం
- ప్రచారాన్ని అడ్డుకునే హక్కు ఏవరికి లేదు
- హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీశ్





కోహెడ, అక్టోబర్ 26, (మనం న్యూస్) : ఓటు ఎంతో పవిత్రమైనదని, దానిని స్వేచ్ఛగా వినియోగించుకోండి మీకు మేమ భరోసాగా ఉంటామని హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీశ్ అన్నారు. మండల కేంద్రంలో ఏసిపి సతీశ్, హుస్నాబాద్ సి.ఐ.కిరణ్ ఆధ్వర్యంలో సశస్త్ర సీమా బల్ కేంద్ర బలగాలతో గురువారం పోలీసుల కవాతు నిర్వహించారు. ఆనంతరం ఏసిపి సతీశ్ మాట్లాడుతూ ఓటర్లలో నమ్మకాన్ని, ధైర్యాన్ని కలిగించడానికి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికే "ఫ్లాగ్ మార్చ్" నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫ్లాగ్ మార్చ్ అనేది విధి నిర్వహణలో ఒక భాగమని, స్వేచ్ఛాయూత వాతావరణం కల్పించడానికి, సంఘ విద్రోహ శక్తులకు హెచ్చరికలు తెలపడానికి నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలు ప్రతి ఒక్కరూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలన్నారు. ఆటంకం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని, పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూనే తమ విధి నిర్వహణ పట్ల బాధ్యతయుతంగానే వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. లేదంటే డయల్ 100, కంట్రోల్ రూమ్ 8712667100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. మద్యానికి, డబ్బులకు మరే ఇతర వస్తువులకు బానిసలు కావొద్దన్నారు. మీకు నచ్చిన మెచ్చిన అభ్యర్థికి నిజాయితీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు వేసి ఓటు శాతాన్ని పెంచాలని ఆయన సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను జరిపించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. పోలింగ్ రోజు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఏ పార్టీ నుండి ఏ వ్యక్తి వచ్చిన ఏ గ్రామంలోనైనా ప్రచారం చేసుకోవచ్చు అన్నారు. వారిని ఏవరూ అడ్డుకోవద్దు అని ఆయన హెచ్చరించారు. అడ్డుకున్న వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పారామిలటరీ దళాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏవరైన ఓటేయమని డబ్బులు పంచితే భారత ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశపెట్టిన సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోహెడ సబ్‌ఇన్‌స్పెక్టర్ తిరుపతి, హుస్నాబాద్ సబ్‌ఇన్‌స్పెక్టర్ తోట మహేశ్, అక్కనపేట సబ్‌ఇన్‌స్పెక్టర్ తాండ్ర వివేక్, పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.

# లంక సంచలన విజయం..

### డిఫెండింగ్ ఛాంపియన్లకు అస్సాం ట్రైనే గతి

భారత్ వేదికగా జరుగుతున్న వన్డే ప్రపంచకప్లో డిఫెండింగ్ ఛాంపియన్గా బరిలోకి దిగిన ఇంగ్లండ్ సెమీస్ అవకాశాలు దాదాపు ముగిసినట్టే. ఇదివరకే ఆడిన నాలుగు మ్యాచ్లలో మూడింట ఓడిన ఇంగ్లీష్ జట్టు తాజాగా బెంగళూరు వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్లో కూడా చిత్తుగా ఓడింది. ఈ ఓటమితో ఇంగ్లండ్ సెమీస్ రేసు నుంచి అనధికారికంగా తప్పుకున్నట్టే. బ్యాటింగ్కు అనుకూలించే చిన్నస్వామి పిచ్లో ప్రపంచ స్థాయి బ్యాటర్లు అయిన ఇంగ్లండ్ ఆటగాళ్లు దారుణంగా తడబడి 156 పరుగులకే ఆలౌట్ అయ్యారు. లక్ష్య ఛేదనలో శ్రీలంక.. 25.4 ఓవర్లలోనే రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి టోర్నీలో రెండో విజయాన్ని నమోదుచేసింది. ఇంగ్లండ్కు ఇది ఆడిన ఐదు మ్యాచ్లలో నాలుగో ఓటమి.

స్వల్ప లక్ష్య ఛేదనలో శ్రీలంక ఆదిలోనే తడబడింది. ఓపెనర్ కుశాల్ పెరీరా (4)తో పాటు కెప్టెన్ కుశాల్ మెండిస్ (11)లు త్వరగా నిష్క్రమించారు. ఈ రెండు వికెట్లు డేవిడ్ విల్లేకు దక్కాయి. 23 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన లంకను మరో ఓపెనర్ పతుమ్ నిస్సంక (83 బంతుల్లో 77, 7 ఫోర్లు, 2 సిక్సర్లు), సదీర సమరవిక్రమ (54 బంతుల్లో 64, 7 ఫోర్లు, 1సిక్సర్) ఆదుకున్నారు. ఈ ఇద్దరూ ఇంగ్లండ్ బౌలింగ్ దళాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని మూడో వికెట్కు 122 బంతుల్లో 137 పరుగులు జోడించి ఇంగ్లండ్కు షాకిచ్చారు. నిస్సంకకు వరల్ కప్లో ఇది వరుసగా నాలుగో అర్థ శతకం. వరల్ కప్లో ఇదివరకే సెంచరీ చేసిన సమర విక్రమకు ఇది రెండో అర్థ సెంచరీ కావడం విశేషం.

వికెట్ల కోసం ఇంగ్లండ్ బౌలర్లు ప్రయత్నించినా ఛేదించాల్సిన లక్ష్యం మరీ చిన్నదిగా ఉండటంతో వాళ్లకు అవకాశమే లేకుండా పోయింది. రెండు వికెట్లు తీశాక బట్లర్.. లంకను ఒత్తిడిలోకి నెట్టేందుకు బ్యాటర్ల చుట్టూ ఫీల్డర్లను మొహరించినా సమరవిక్రమ, నిస్సంకలు సంయమనంతో ఆడి లంకకు విజయాన్ని అందించారు. మొదట్లో కుదురుకునేదాకా నెమ్మదిగా ఆడిన ఈ జోడీ తర్వాత పుంజుకుంది. అంతకుముందు ఇంగ్లండ్ బ్యాటింగ్లో దారుణంగా తడబడింది. బెన్ స్టోక్స్ (73 బంతుల్లో 43, 6 ఫోర్లు) టాప్ స్కోరర్. బట్లర్, రూట్, మలన్, లివింగ్స్టన్, మోయిన్ అలీ లు విఫలమయ్యారు.

### లంక రికార్డు సేఫ్..

వన్డే వరల్ కప్లో లంకకు ఇంగ్లండ్పై ఇది వరుసగా ఐదో విజయం కావడం గమనార్హం. ఇంగ్లండ్.. చివరిసారిగా 1999 ప్రపంచకప్లో శ్రీలంకపై నెగ్గింది. 2007, 2011, 2015, 2019లలో ఇంగ్లండ్కు షాకులు తప్పలేదు. ఇప్పుడు ఆ రికార్డును శ్రీలంక మరింత మెరుగుపరుచుకుంది.



# పాక్, ఇంగ్లండ్ ఔట్..
# సెమీ ఫైనల్ చేరే నాలుగు జట్లు ఇవే!



2023లో సగం మ్యాచ్లు చూస్తుండగానే అయిపోయాయి. అభిమానులు ఆశించిన రీతిలో ఈ మెగా టోర్నీ అయితే సాగడం లేదు. వన్సైడ్ మ్యాచ్లతో ప్రపంచకప్ తీవ్ర బోర్ తెప్పిస్తోంది. ఇప్పటికే 25 మ్యాచ్లు పూర్తవ్వగా ఒక్క మ్యాచ్ కూడా 100 ఓవర్ల పాటు జరగలేదు. ఈ 25 మ్యాచ్లో ఒకటి రెండు మినహా.. అన్నీ ఏకపక్షంగానే ముగిసాయి. లీగ్ దశలో ప్రతీ టీమ్ తొమ్మిదేసి మ్యాచ్ లు ఆడాల్సి ఉండగా.. ఇప్పటికే ఐదేసి మ్యాచ్లు ఆడేసాయి. సగం టోర్నీ ముగిసేసరికి పాయింట్స్ టేబుల్లో భారత్ అగ్రస్థానంలో నిలవగా.. సౌతాఫ్రికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా టాప్-4లో కొనసాగుతున్నాయి. లీగ్ దశ ముగిసేసరికి టాప్-4లో నిలిచిన జట్లే సెమీఫైనల్కు అర్హత సాధిస్తాయి. ఏదైనా అద్భుతాలు జరిగితే తప్ప దాదాపు ప్రస్తుతం టేబుల్ టాప్లో ఉన్న నాలుగు జట్లు సెమీస్కు వెళ్ళే అవకాశాలే ఎక్కువ... జట్ల వారిగా సెమీఫైనల్ అవకాశాలను పరిశీలిస్తే... ప్రస్తుత టాప్-4 టీమ్స్కు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. టీమిండియా: ఆడిన ఐదు మ్యాచ్లో విజయం సాధించిన భారత్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుత జోష్ చూస్తూ ఉంటే టీమిండియా ఆడాల్సిన మిగతా మ్యాచ్లో సౌతాఫ్రికాతో మ్యాచ్ తప్ప మిగిలిన మూడూ అవలీలగా గెలుస్తోందనిపిస్తోంది. అదే జరిగితే టేబుల్ టాపర్గా సెమీఫైనల్ వెళ్లనుంది. చివరి 4 మ్యాచ్లో టీమిండియా రెండు గెలిచినా సెమీస్ బెర్త్ ఖరారు అవుతోంది.

సౌతాఫ్రికా: ఈ టోర్నీలో అండర్ డాగ్గా ఎంటర్ అయ్యి అందరి అంచనాలను తలకిందులు చేస్తూ అద్భుతమైన ఆట తీరుతో దూసుకెళ్తున్న సౌతాఫ్రికా.. టేబుల్లో సెకండ్ ప్లేస్లో ఉంది. ఆడిన ఐదు మ్యాచ్లో నాలుగు సార్లు భారీ స్కోర్ చేసింది. నెదర్లాండ్స్తో మాత్రం అనూహ్య రీతిలో ఓటమిపాలైంది. చివరి నాలుగు మ్యాచ్లో సౌతాఫ్రికాకు రెండు కీలక మ్యాచ్లు ఉన్నాయి.

భారత్, న్యూజిలాండ్ జట్లతో ఓడినా బంగ్లాదేశ్, పాకిస్థాన్ జట్లను ఓడించడం సౌతాఫ్రికా పెద్ద కష్టమేమి కాదు. ఈ నాలుగు మ్యాచ్లో ఓడితేనే ఆ జట్టు సెమీస్ రేసు నుంచి తప్పుకుంటుంది.

న్యూజిలాండ్: 5 మ్యాచ్లో నాలుగు గెలిచిన కివీస్.. భారత్ చేతిలో ఓటమిపాలై మూడో స్థానంలో ఉంది. ఆ జట్టు ప్రస్తుత ట్రాక్ రికార్డ్ చూస్తే నాలుగులో రెండు ఖచ్చితంగా గెలిచే అవకాశాలు ఉన్నాయి. సౌతాఫ్రికా, ఆస్ట్రేలియాతో కీలక మ్యాచ్లు ఆడాల్సి ఉంది. ఆల్రౌండ్ ప్రదర్శనతో సత్తా చాటుతున్న కివీస్ను ఓండించడం కష్టమే.

ఆస్ట్రేలియా: ఐదు మ్యాచ్లు ఆడిన ఆస్ట్రేలియా మూడు మాత్రమే గెలిచింది. చివరి నాలుగు మ్యాచ్లో ఆ జట్టు న్యూజిలాండ్, ఇంగ్లండ్తో కీలక మ్యాచ్లు ఆడనుంది. ఈ రెండింటిలో ఒకటి గెలిచినా.. బంగ్లా, అఫ్గానిస్థాన్లు ఓడించినా ఆస్ట్రేలియా సెమీస్ బెర్త్ ఖాయమవుతోంది.

పాకిస్థాన్: ఇంకా నాలుగు కీలక మ్యాచ్లు ఉన్నాయి. ఇంగ్లండ్, సౌతాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లతో దాయదీ టీమ్ ఆడాల్సి ఉంది. ఈ నాలుగింటికి నాలుగు మ్యాచ్లు గెలవడంతో పాటు మెరుగైన రన్రేట్ సాధిస్తేనే ఆ జట్టుకు సెమీస్ బెర్త్ దక్కుతోంది. అఫ్గాన్, నెదర్లాండ్స్, బంగ్లాదేశ్ జట్లు దాదాపు రేసు నుంచి తప్పుకున్నాయి. సంచలన ఫలితాలు నమోదు చేస్తే... అఫ్గాన్కు అవకాశం ఉంటుంది.

నాలుగు మ్యాచ్లో ఒకటి మాత్రమే గెలిచిన డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్.. శ్రీలంకతో కూడా ఓటమి దిశగా సాగుతోంది. ఇంగ్లండ్ కూడా దాదాపు సెమీఫైనల్ రేసు నుంచి తప్పుకున్నట్లే.

## 2024 మినీ వేలం ముహూర్తం ఫిక్స్.. ఎక్కడ? ఎప్పుడంటే..?



వన్డే ప్రపంచకప్ 2023 ముగిసిన వెంటనే భారత క్రికెట్ అభిమానులను అలరించేందుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సిద్ధమవుతోంది. ఐపీఎల్ 2024 సీజన్ మినీ వేలానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ముహూర్తం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 15-19 మధ్య దుబాయ్ వేదికగా ఐపీఎల్ 2024 మినీ వేలం నిర్వహించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2024 మినీ వేలంతో పాటు గతేడాదే మహిళా క్రికెట్ అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) రెండో సీజన్ మినీ వేలాన్ని కూడా నిర్వహించాలని బీసీసీఐ ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ముందుగా డబ్ల్యూపీఎల్ మినీ వేలం నిర్వహించి.. ఆ తర్వాత పురుషుల మినీ వేలాన్ని పూర్తి చేయాలని బీసీసీఐ కార్యవర్గం నిర్ణయించినట్లు సమాచారం. డిసెంబర్ 9న డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ మినీ వేలం జరపాలని, డిసెంబర్ 15-19న ఐపీఎల్ 2024 మినీ వేలాన్ని పూర్తి చేయాలని బీసీసీఐ పెద్దలు నిర్ణయించినట్లు బోర్డుకు చెందిన ఓ అధికారి తెలిపారు.

గతేడాది కూడా మినీ వేలాన్ని ఇస్తాంబుల్ (టర్కీ) వేదికగా నిర్వహిస్తారని ప్రచారం జరిగింది. ఇస్తాంబుల్లో బీసీసీఐ ఏర్పాట్లను కూడా పూర్తి చేసిందని వార్తలు వచ్చాయి. కానీ చివరి నిమిషంలో ఇస్తాంబుల్ను కాదని కేరళలోని కొచ్చి వేదికగా ఐపీఎల్ మినీ వేలాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. గతేడాది ఐపీఎల్ మీడియా హక్కుల వేలం ద్వారా బీసీసీఐ దాదాపు రూ. 48వేల కోట్లు ఆర్జించి రికార్డు సృష్టించింది. అమెరికాలో జరిగే నేషనల్ ఫుట్బాల్ లీగ్ (ఎన్ఎఫ్ఎల్) తర్వాత అత్యధిక సంపన్నమైన లీగ్గా ఐపీఎల్ గుర్తింపు పొందింది. దేశానికి ఒక ఫ్రాంచైజీ లీగ్ ఉన్నా బీసీసీఐకి కాసుల వర్షం కురిపిస్తున్నది మాత్రం ఐపీఎల్ మాత్రమే. ఈ క్రమంలోనే ఐపీఎల్ పరిధిని విశ్వవ్యాప్తం చేయడానికి బీసీసీఐ ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ 2024 సీజన్ వేలాన్ని దుబాయ్లో నిర్వహించాలని ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రపంచకప్ నిర్వహణ విషయంలో బిజీగా ఉన్న బీసీసీఐ.. మెగా టోర్నీ తర్వాత ఫ్రాంచైజీలకు పూర్తి వివరాలు వెల్లడించడంతో పాటు వేలం రూల్స్, రిటైన్, రిలీజ్ ఆటగాళ్ల జాబితాలను సమర్పించేందుకు చివరి తేదీలను ప్రకటించనుంది. వన్డే వరల్ కప్ పనుల్లో బిజీగా ఉన్న బీసీసీఐ.. మెగా టోర్నీ ముగిశాక పూర్తివివరాలను ఫ్రాంచైజీలతో పంచుకునే అవకాశమున్నట్టు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.



మనం సినిమా
manamcinema

## అమలాపాల్‌కు వెడ్డింగ్ ప్రపోజల్..?

బెజవాడ, లవ్ ఫెయిల్యూర్, నాయక్, ఇద్దరమ్మాయిలతో, జెండాపై కపిరాజు సినిమాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకుంది అమలాపాల్. మాలీవుడ్ నుంచి టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి.. తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న భామల్లో టాప్‌లో ఉంటుంది అమలాపాల్. మలయాళం, తమిళం, తెలుగు భాషల్లో సినిమాలు చేస్తూ.. ఫుల్ బిజీగా మారిన అమలాపాల్ పర్సనల్ లైఫ్‌లో మరో కీలక ముందడుగు వేయబోతుందన్న వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఇంతకీ విషయమేంటనుకుంటున్నారా..? అమలాపాల్ మరో పెళ్లికి రెడీ అయింది. ఈ భామ పాపులర్ డైరెక్టర్ ఏఎల్ విజయ్‌ను 2014లో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత వ్యక్తిగత కారణాలతో 2017తో విజయ్ నుంచి విడాకులు తీసుకుంది. అప్పటినుంచి సింగిల్‌గా ఉన్న అమలాపాల్ కొత్త రిలేషన్‌షిప్‌ను షురూ చేసింది. మరి ఇంతకీ అతడు ఎవరనే కదా మీ డౌటు. అమలాపాల్ లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ జగత్ దేశాయ్. బర్త్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా అమలాపాల్‌కు జగత్ దేశాయ్ వెడ్డింగ్ ప్రపోజల్ పెట్టగా.. ఓ కిస్‌తో గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇప్పుడీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఇంకేంటి త్వరలోనే అమలాపాల్ ఇంట వెడ్డింగ్ బెల్స్ మోగడం ఖాయమైనట్టేనని తాజా అప్‌డేట్‌తో క్లారిటీ వచ్చేసింది. వెడ్డింగ్‌పై రాబోయే రోజుల్లో క్లారిటీ రానుంది.



## రవితేజ - గోపీచంద్ మలినేని మాసివ్ ప్రాజెక్ట్ లాంచ్

రీసెంట్‌గా మాస్ మహారాజ రవితేజ హీరోగా నటించిన భారీ చిత్రం టైగర్ నాగేశ్వరరావుతో మంచి రెస్పాన్స్‌ని అందుకున్న తాను ఈ చిత్రం తర్వాత మరిన్ని భారీ చిత్రాలు అయితే చేయనున్న సంగతి తెలిసిందే. వాటిలో ఇది వరకే అనౌన్స్ చేసిన క్రేజీ ప్రాజెక్ట్ దర్శకుడు గోపీచంద్ మలినేనితో నాలుగవ సినిమాగా కూడా ఒకటి. మరి ఈ చిత్రం నుంచి నిన్ననే సాలిడ్ అప్డేట్ సినిమా మెయిన్ కాస్ట్ అండ్ క్రూని మేకర్స్ రివీల్ చేశారు. ఇక ఈరోజు అయితే గ్రాండ్‌గా సినిమాని ముహూర్త కార్యక్రమాలతో లాంఛనంగా ఆరంభించినట్టుగా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు వివి వినాయక్ ఫస్ట్ క్లాప్‌ని కొట్టగా.. దిగ్గజ దర్శక నిర్మాతలు కె రాఘవేంద్రరావు మరియు అల్లు అరవింద్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక అలాగే కోలీవుడ్ నటుడు సెల్వ రాఘవన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక ఇలా అట్టహాసంగా స్టార్ట్ అయ్యిన ఈ మాసివ్ ప్రాజెక్ట్ షూటింగ్ అయితే అతి త్వరలోనే మొదలు కానుంది అని మైత్రి మూవీ మేకర్స్ కన్ఫర్మ్ చేశారు.

## మీడియాను క్షమాపణలు కోరిన యాంకర్ సుమ



యాంకర్ సుమ.. ఈ పేరు తెలియని వారు ఉండరు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకూ సుమ ఎవరు..? అని అడగ్గా టక్కున చెప్పేస్తారు. సుమ కేరళ కుట్టి అయినప్పటికీ తెలుగులో గడగడా మాట్లాడుతూ.. ప్రేక్షకుల్ని కట్టిపడేస్తుంటుంది. ఏ సినిమా ఈవెంట్, షో అయినా వ్యాఖ్యాతగా సుమ ఉండాల్సిందే. కొందరు దర్శక నిర్మాతలు సుమ డేట్స్ కోసం తమ ఈవెంట్స్‌ను కూడా పోస్ట్ పోన్ చేసుకుంటుంటారు. అంతటి గుర్తింపు తెచ్చుకున్న సుమ.. తాజాగా మీడియాను క్షమాపణలు కోరింది. పంజా వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా తెరకెక్కుతున్న సినిమా 'ఆదికేశవ' . ఈ సినిమాలోని 'లీలమ్మో' పాట విడుదల వేడుకను చిత్ర బృందం హైదాబాద్లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ ఈవెంట్‌కు సుమ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మీడియాపై నోరు పారేసుకున్నారు. 'మీడియా వారు స్నాక్స్ను భోజనంలా తింటున్నారు' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని ఓ విలేకరు సీరియస్గా తీసుకున్నారు. మీడియా వారిని అలా అనకుండా ఉండాల్సింది అని సుమ ముందే తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో సుమ స్పందిస్తూ.. 'మీడియా వారంతా నాతో చాలాకాలంగా కలిసి ప్రయాణిస్తున్నారు. ఆ చనువుతోనే అలా అన్నాను' అని సమాధానమిచ్చారు. ఆ తర్వాత 'మీరు స్నాక్స్ను స్నాక్స్‌నే తిన్నారు.. ఓకేనా' అంటూ సదరు విలేకరుని కూల్ చేసే ప్రయత్నం చేశారు. దీంతో ఆతడు మరోసారి అసహనానికి గురయ్యారు. 'ఇదే వద్దనేని. మీ యాంకరింగ్ అందరికీ ఇష్టమే. మాకు కూడా నచ్చుతుంది. అయితే, మీడియా విషయంలో ఇలాంటివి వద్దు' అంటూ ఘాటుగా సమాధానమిచ్చారు. వెంటనే సుమ అక్కడే విలేకరులకు క్షమాపణలు చెప్పారు. ఇప్పుడు తాజాగా ఓ వీడియో రిలీజ్ చేశారు. 'మీడియా మిత్రులందరికీ నమస్కారం. ఈ రోజు నేనొక ఈవెంట్లో చేసిన వ్యాఖ్యలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టాయని నాకు అర్థమవుతోంది. నిండు మనసుతో క్షమాపణ కోరుతున్నా. మీరెంత కష్టపడి పనిచేస్తారో నాకు తెలుసు. మీరు, నేను కలిసి కొన్నేళ్ల నుంచి ప్రయాణిస్తున్నాం. నన్ను ఓ కుటుంబ సభ్యురాలిగా భావించి క్షమిస్తారని ఆశిస్తున్నా' అని వీడియోలో చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Nava Telangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godhavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar. 505001, Telangana. Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2017/73893. E-mail Id: editor@manamnews.com.